




# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక     PEN POWER TELUGU DAILY     ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11   సంచిక : 257   పేజీలు :12   సంపాదకులు : గంట్యాడ అప్పారావు   ప్రచురణ : ఒంగోలు   శనివారం 24 మే 2025   వెల : 5/-రూ॥

VOLUME :11   ISSUE : 257   PAGES :12   EDITOR : GANTYADA APPARAO   PUBLISHED :ONGOLE   SAT 24 MAY 2025   PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## ఈ దుర్మార్గం రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీని సూచిస్తోంది

- వైసీపీ నేత కుమారుడిపై పోలీసులు దుర్మార్గానికి పాల్పడ్డారన్న జగన్
- థర్డ్ డిగ్రీ ప్రయోగించారంటూ ఆరోపణ
- చంద్రబాబు శిశుపాలుడి మాదిరి తప్పులు చేస్తున్నాడంటూ ట్వీట్



పెన్ పవర్ డెస్క్:పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఎల్లయ్య కుమారుడు హరికృష్ణపై దాచేపల్లి పోలీసులు చేసిన దుర్మార్గం రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీని సూచిస్తోందని వైసీపీ అధినేత జగన్ ధ్వజమెత్తారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే వారిపై హింసకు పాల్పడడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు. చట్టాన్ని చేతిలోకి తీసుకునే అధికారాన్ని వీరికి ఎవరు ఇచ్చారు? థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా? దాన్ని సమర్థించుకునేందుకు ఒక కట్టుకథ అల్లుతారా? అని మండిపడ్డారు.
"స్వయంగా టీడీపీ నేత కార్లో హరికృష్ణను తరలించి, స్టేషన్లో తీవ్రంగా కొట్టి, సీఐ క్వార్టర్స్ లో దాచిపెడతారా? హరికృష్ణ తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన చేయకపోతే అతన్ని ఏం చేసేవారు? ఎవరి ఆదేశాలతో, ఎవరి అండతో ఈ దుర్మార్గాలన్నీ చేస్తున్నారు. ఇది రాజ్య హింస కాదా? ఇక పౌరులకు రక్షణ ఏముంటుంది? ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం కాదంటారా? చట్టాన్ని, న్యాయాన్ని బేఖాతరు చేయడం కాదా?" అని నిలదీశారు. "చంద్రబాబు గారూ.. రెడ్‌బుక్ రాజ్యాంగంలో మీరు శిశుపాలుడి మాదిరి పాపాలు చేస్తున్నారు. ఇక ప్రజలు ఎంతమాత్రం సహించరు. ఈ అంశాన్ని అన్ని వ్యవస్థల దృష్టికీ తీసుకెళతాం. హరికృష్ణకు న్యాయం జరిగేంతవరకూ ఈ వ్యవహారాన్ని విడిచిపెట్టం" అని జగన్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఓ వీడియోను కూడా జగన్ పంచుకున్నారు.

## సమష్టిగా పనిచేస్తాం

### తెలుగు రాష్ట్రాల సివిల్ సప్లై మంత్రుల సమావేశంలో మంత్రి నాదెండ్ల




- హైదరాబాదులో ఏపీ, తెలంగాణ పౌర సరఫరాల శాఖ మంత్రుల సమావేశం
- హాజరైన నాదెండ్ల మనోహర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రాష్ట్ర విభజన తరువాత ఏర్పడిన పౌర సరఫరాల విభజన, పరస్పర సహకార అంశాలపై చర్చ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పౌర సరఫరాల శాఖ మంత్రుల సమావేశం ఇవాళ హైదరాబాద్ లో జరిగింది. ఎర్రమంజిల్‌లోని ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై కార్పొరేషన్ భవనంలో జరిగిన ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, తెలంగాణ రాష్ట్ర మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరురాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత ఏర్పడిన పౌర

వివరాలు 2లో..

### సెన్సార్ బోర్డుపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన రామ్ గోపాల్ వర్మ



- స్మార్ట్‌ఫోన్లలో పోర్న్, హింస చూస్తున్నారన్న వర్మ
- సినిమాల్లో వద్దనడం అర్థరహితమంటూ వ్యాఖ్య
- సెన్సార్ బోర్డు ఎప్పుడో ఎక్స్‌పైర్ అయిందన్న ఆర్జీవీ

పెన్ పవర్ డెస్క్: ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు.

వివరాలు 2లో..

## సిగరెట్ల కంటే ఇవి లక్షల రెట్లు ప్రమాదకరం

- బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలపై చర్యలు ఏవన్న పాల్
- 11 వందల మంది సెలబ్రిటీలు యాప్ లను ప్రమోట్ చేశారని వ్యాఖ్య
- బెట్టింగ్ యాప్ లపై సుప్రీంకోర్టు సీరియస్ అయిందన్న పాల్

వివరాలు 2లో..



## ఏపీలో మెగా డీఎస్సీకి లైన్ క్లియర్.. సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు

- డీఎస్సీ వాయిదా కోరుతూ పిటిషన్లు దాఖలు
- పిటిషన్లు కొట్టివేసిన సుప్రీంకోర్టు
- ఏవైనా సమస్యలుంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్లకు సూచన
- జూన్ 6 నుంచి జూలై 6 వరకు డీఎస్సీ పరీక్షలు యథాతథం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ) షెడ్యూల్ విషయంలో నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే డీఎస్సీ, ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) జరుగుతా యని సర్వోన్నత

వివరాలు 2లో..




### నాలోని ఒరిజినల్ అలాగే ఉంది... ఎవరూ డీలా పడొద్దు

- ధర్మవరం మినీ మహానాడులో శ్రీరామ్ కీలక వ్యాఖ్యలు
- కార్యకర్తలు బయపడొద్దని వ్యాఖ్య
- ఇంకా నాలుగేళ్ల సమయం ఉందన్న శ్రీరామ్



పెన్ పవర్ డెస్క్:శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజక వర్గంలో జరిగిన తెలుగుదేశం పార్టీ మినీ మహానాడులో ఆ పార్టీ నేత,

వివరాలు 2లో..

### సుప్రీంకోర్టులో ఈ పద్ధతి మారాలి

#### జస్టిస్ అభయ్ ఓకా సంచలన వ్యాఖ్యలు



- పదవీ విరమణ సందర్భంగా సుప్రీంకోర్టు జస్టిస్ ఏఎస్ ఓకా కీలక వ్యాఖ్యలు
- సుప్రీంకోర్టు సీజేఐ కేంద్రంగా నడుస్తోందని, ఇందులో మార్పు రావాలని సూచన
- హైకోర్టులు మరింత ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేస్తాయని అభిప్రాయం

పెన్ పవర్ డెస్క్:సుప్రీంకోర్టు పనితీరులో మార్పులు రావాల్సిన అవసరం ఉందని జస్టిస్ అభయ్ ఓకా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు అంతా ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కేంద్రబిం దువుగా నడుస్తోందని వ్యాఖ్యానించారు. శుక్రవారం తన పదవీ విరమణ సందర్భంగా సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో జస్టిస్ అభయ్ ఓకా ప్రసంగిస్తూ, న్యాయవ్యవస్థలో పలు సంస్కరణల ఆవశ్యకతను నొక్కిచెప్పారు. సుప్రీంకోర్టుతో పోలిస్తే హైకోర్టులు మరింత ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేస్తాయని జస్టిస్ ఓకా అభిప్రా యపడ్డారు. "హైకోర్టులు కమిటీల ద్వారా పనిచేస్తాయి, కానీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేంద్రంగా నడుస్తోంది. ఇది మారాలి. నూతన సీజేఐ (జస్టిస్ బీఆర్ గవాయ్) ఆధ్వర్యంలో ఈ మార్పును మీరు చూస్తారు" అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..

## జగన్ ప్రశ్నలకు బదులివ్వండి: కూటమి ప్రభుత్వంపై శైలజానాథ్ ధ్వజం

- లిక్కర్ స్కామ్‌పై కూటమిది కట్టుకథ అన్న శైలజానాథ్
- కూటమి నేతల మాటల్లో పొంతన లేదని ఎద్దేవా


పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి లేవనెత్తిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెప్పాలని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. తాడే పల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న మద్యం కుంభకోణాన్ని వైఎస్ జగన్ ఆధారాలతో సహా బయటపెట్టారని, దానికి స్పందించకుండా ఈనాడు పత్రిక ద్వారా తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చెబుతున్న మద్యం కుంభకోణంలో కోట్ల పేజీల సమాచారం డిలీట్ అయిందంటూ

వివరాలు 2లో..



## ఐఫోన్లు అమెరికాలోనే తయారుకావాలి, లేదంటే 25% సుంకం

### ఆపిల్‌కు ట్రంప్ వార్నింగ్



- అమెరికాలో అమ్మే ఐఫోన్లు అక్కడే తయారవ్వాలని ట్రంప్ స్పష్టం
- భారత్ లేదా ఇతర దేశాల్లో తయారు చేస్తే 25% సుంకం తప్పదని వార్నింగ్
- టిమ్ కుక్‌కు ఈ విషయం ముందే చెప్పానన్న ట్రంప్
- భారత్‌లో ఆపిల్ ఉత్పత్తి పెంపుపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి
- ట్రంప్ వ్యాఖ్యలతో ఆపిల్ షేర్లు 3% పైగా పతనం

పెన్ పవర్ డెస్క్:అమెరికాలో విక్రయించే ఐఫోన్‌లను భారత్‌లో గానీ, మరే ఇతర దేశంలో గానీ కాకుండా అమెరికాలోనే తయారు చేయాలని, లేదంటే కనీసం 25 శాతం సుంకం చెల్లించాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్

వివరాలు 2లో..

## పెరుగుతున్న కరోనా కేసులు... తొమ్మిది నెలల శిశువుకు పాజిటివ్

దేశంలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు

బెంగళూరులో 9 నెలల బాలుడికి కొవిడ్ నిర్ధారణ

కేరళలో మే నెలలో 182 కేసులు నమోదు




పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి మరోసారి నెమ్మదిగా పంజా విసురుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. పలు రాష్ట్రాల్లో కొవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా కర్ణాటక, కేరళ వంటి పొరుగు రాష్ట్రాల్లో కొత్త కేసులు వెలుగుచూడటంతో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ కూడా అప్రమత్తమైంది.
కర్ణాటక రాజధాని బెంగళూరులో తొమ్మిది నెలల పసికందుకు కరోనా సోకినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. హొస్కోటే ప్రాంతానికి చెందిన ఈ చిన్నారిని అనారోగ్యంతో మొదట ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కలాసిపాల్యలోని వాణి విలాస్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో మే 22న చిన్నారికి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని కర్ణాటక కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి హర్ష్ గుప్తా తెలిపారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన పేర్కొన్నారు. పొరుగు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### బీఆర్ఎస్ లో ఆధిపత్య పోరుకు ఇది నిదర్శనమా? కవిత ప్రశ్నల్లో తప్పేముంది?

బీఆర్ఎస్ లో ఆధిపత్య పోరు స్పష్టంగా కనపడుతుంది. కేసీఆర్ కాకుండా ఇప్పుడు బీఆర్ఎస్ లో మూడు వర్గాలు అయిపోయినట్లు స్పష్టంగా కనపడుతుంది.ప్రాంతీయ పార్టీలు అధికారం కోల్పోయినప్పుడు ఇది సర్వసాధారణమే. అయినప్పటికీ క్యాడర్ లో నిరాశ నిస్పృహను కలిగిస్తాయని వేరే చెప్పాల్సిన పనిలేదు. వారసత్వం కోసం సహజంగానే పోటీ పెరుగుతుంది. కుమారుడిగా కేటీఆర్ కు కేసీఆర్ తర్వాత పార్టీ పగ్గాలను స్వీకరించేందుకు అన్ని అర్హతలున్నాయి. అలాగే కుమార్తెగా కల్వకుంట్ల కవితకు కూడా ఈ విషయంలో ఎలాంటి అడ్డంకులు లేవు. ఇక మేనల్లుడు హరీశ్ రావుకు మాస్ ఫాలోయింగ్ ఉండటంతో ఆయన కూడా పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అందుకే ముగ్గురు నేతలు వారసత్వం కోసం ఆశలు పెంచుకోవడంలో తప్పులేదు.

**హరీశ్ రావును బుజ్జగించినా...**

నిన్నటి వరకూ హరీశ్ రావు వేరుకుంపటి పెట్టుకుంటారన్న వార్తలు కొంత సంచలనం కలిగించాయి. అయితే హరీశ్ రావుతో కేటీఆర్ ఆయన ఇంటికి వెళ్లి మరీ కలసి వచ్చారు. ఇక హరీశ్ రావు ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కు వెళ్లి రెండు రోజులుగా కేసీఆర్ తో సమావేశమవుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఇచ్చిన నోటీసులపై చర్చిందేకేనని బయటకు చెబుతున్నప్పటికీ హరీశ్ రావును కేసీఆర్ బుజ్జగించడానికే పిలిచారన్న టాక్ వినపడుతుంది. కేసీఆర్ తో సమావేశం తర్వాతనే హరీశ్ రావు కేటీఆర్ కు పార్టీ పగ్గాలతో పాటు అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి పదవి ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని హరీశ్ రావు చెప్పారు. హరీశ్ రావు తాను సాధారణ కార్యకర్తగా పార్టీలో పనిచేస్తానని చెప్పారు.

**కేటీఆర్ కు అర్హత ఉన్నా...**

కేటీఆర్ ఉన్నత చదువులు చదువుకుని ఉద్యమంలో పాల్గొంటూ రాజకీయాల్లోకి వచ్చారు. తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. అందుకే ఆయనకు ముందుగానే కేసీఆర్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని అప్పగించారు. కొన్నేళ్ల నుంచి పార్టీని కేటీఆర్ నడిపిస్తున్నాడు. ఏడాది నుంచి కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమయితే కేటీఆర్ అంతా తానే అయి చూసుకుంటున్నారు. క్యాడర్ కూడా తమ భవిష్యత్ నేత కేటీఆర్ అని మానసికంగా ఫిక్స్ అయ్యారు. నేతలు కూడా కేటీఆర్ చుట్టూ ప్రదిక్షిణలు చేస్తున్నారంటే ఎర్రవెల్లి ఫామ్ హౌస్ నుంచి అదే రకమైన సిగ్నల్స్ వచ్చాయని అనుకోవాలి. అందుకే కేటీఆర్ కు పార్టీ పగ్గాలను పూర్తిగా అప్పగిస్తానని కేసీఆర్ చెప్పినా ఎవరూ అభ్యంతరం చెప్పరు కూడా.

**కవిత విషయంలోనే...**

కానీ కల్వకుంట్ల కవిత విషయంలోనే కొంత తేడా కనపడుతుంది. ఆమెపై ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు ఉంది. ఆరు నెలల పాటు జైల్లో ఉండి వచ్చారు. అందులో నిజానిజాలు ఎలా ఉన్నప్పటికీ కవిత అందులో దోషిగానే జనం చూస్తున్నారు. ఈ సమయంలో కవితకు ప్రాధాన్యం ఇస్తే బాగుండదని కేసీఆర్ భావించి ఉండవచ్చు. అదే సమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో కయ్యానికి దిగే కంటే కాంగ్రెస్ ను ముందు రాష్ట్రంలో అణిచివేయాలన్న ప్లాన్ తోనే కేసీఆర్ బీజేపీపై ఫైర్ కాకపోయి ఉండవచ్చున్న భావన కలుగుతుంది. కవిత తనను జైల్లో పెట్టిన పార్టీని ఒక్క మాట మాట్లాడకుండా ప్రసంగాన్ని ముగించడంపైనే అభ్యంతరం తెలిపారు. తాను కూడా ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించానని, జాగృతి పేరుతో మహిళలను ఏకం చేశానని, అలాంటి తనను పక్కన పెట్టడంపై ఆమె కొంత ఇబ్బంది పడుతున్నారు. అయితే ఫ్యామిలీ పాలిటిక్స్ కావడంతో ఇది టీ కప్పులో తుపానులా తొలిగిపోతుందని నేతలు చెబుతున్నారు.

# నాలోని ఒరిజినల్ అలాగే ఉంది... ఎవరూ డీలా పడొద్దు

- మొదటి పేజీ తరువాయి

నియోజ కవర్గ టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, పరోక్షంగా పలు కీలక అంశాలను ప్రస్తావించారు. "యుద్ధం చేయాల్సి వచ్చినప్పుడు అర చేయి ఆయుధం అవుతుంది" అని ఆయన అన్నారు. "సమయం మించి పోలేదు, ఇంకా నాలుగేళ్ల సమయం ఉంది" అని పేర్కొంటూ, భవిష్యత్తుపై ధీమా వ్యక్తం చేశారు. "ధర్మవరం నాకు చాలా ఓపిక నేర్పింది. కానీ, నాలో ఉన్న ఒరిజనల్ అలానే ఉంది" అంటూ తన సహజశైలి మారలేదని స్పష్టం చేశారు.

కార్యకర్తలు నిరాశ చెందవద్దని సూచిస్తూ, "పొద్దు మునగాలంటేనే సమయం పడుతుంది. ఎందుకు మీరు డీలా పడిపోతున్నారు?" అని ప్రశ్నించారు. "మీరు తప్పు చేసినా, ఒప్పు చేసినా మీ వెంటే ఉంటాను. నా వెంట నడిచి వచ్చిన వారిని ఎవర్నీ మర్చిపోలేదు" అంటూ వారికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో ఎవరికీ భయపడకుండా ధైర్యంగా పార్టీ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో పరిటాల శ్రీరామ్ ధర్మవరం నుంచి పోటీ చేయాలని భావించారు. ఆ దిశగా నియోజకవర్గంలో విస్తృతంగా పనిచేశారు కూడా. అయితే, ఎన్నికల పొత్తుల్లో భాగంగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఈ స్థానాన్ని బీజేపీకి

కేటాయించారు. దీంతో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సత్యకుమార్ యాదవ్ విజయం సాధించి, ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్లో మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో, ధర్మవరం మినీ మహానాడులో పరిటాల శ్రీరామ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఆయన మాటల్లోని అంతరార్థాలపై స్థానిక రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది.

# సెన్సార్ బోర్డుపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన రామ్ గోపాల్ వర్మ

- మొదటి పేజీ తరువాయి

సినిమా ల్లో అసభ్య పదజాలం, సెన్సార్ బోర్డు తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్జీవీ, పలు అంశాలపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించారు."సినిమాల్లో బూతులు ఉండకూడదని చాలా మంది వాదిస్తుంటారు. సెన్సార్ బోర్డు కూడా అనేక నిబంధనలు విధిస్తోంది. సినిమాల్లోనే ఇదంతా ఉన్నట్లు మాట్లాడుతున్నారు" అని ఆర్జీవీ అన్నారు. "ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. వాటిలో పోర్న్ వీడియోలు, అత్యంత హింసాత్మక దృశ్యాలు సులువుగా చూస్తున్నారు. అలాంటప్పుడు, వినోదం కోసం తీసే సినిమాల్లో ఇది ఉండొద్దు, అది చూపించొద్దు అనడం ఎలా సమంజసం? ఫోన్లో చూస్తే తప్పు లేనప్పుడు, పెద్ద తెరపై బూతులు చూస్తే తప్పేంటి? ఇలాంటి ఆంక్షలు పెట్టడం నిజంగా అర్థం లేని పని" అని ఆయన అభిప్రాయపడ్డారు.

సెన్సార్ బోర్డు పనితీరుపై మండిపడుతూ, "సెన్సార్ బోర్డ్ అనేది ఎప్పుడో కాలం చెల్లిపోయింది (ఎక్స్‌పైర్ అయిపోయింది). అదొక స్టుపిడ్ థింగ్" అంటూ ఆర్జీవీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముక్కుసూటిగా మాట్లాడటం, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఆర్జీవీకి కొత్తేమీ కాదు. అయితే, ఈసారి ఏకంగా సెన్సార్ బోర్డునే ఆయన తప్పుబట్టడం గమనార్హం. ఈ వ్యాఖ్యలపై సెన్సార్ బోర్డు ఎలా స్పందిస్తుందో చూడాలి.

# పెరుగుతున్న కరోనా కేసులు... తొమ్మిది నెలల శిశువుకు పాజిటివ్

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్రమైన కేరళలోనూ కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మే నెలలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 182 కొత్త ఇన్ఫెక్షన్లు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, కొవిడ్ నిబంధనలు పాటించాలని కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ హెచ్చరించారు. జిల్లాల వారీగా చూస్తే, కొట్టాయం జిల్లాలో అత్యధికంగా 57 కేసులు నమోదు కాగా, ఎర్నాకుళంలో 34, తిరువనంతపురంలో 30 కేసులు బయటపడ్డాయి.

# సమష్టిగా పనిచేస్తాం

## తెలుగు రాష్ట్రాల సివిల్ సప్లై మంత్రుల సమావేశంలో మంత్రి నాదెండ్ల

- మొదటి పేజీ తరువాయి

సరఫరాల విభజన, పరస్పర సహకార అంశాలపై చర్చలు జరిగాయి. విభజన ఒప్పందం ప్రకారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ భవనం కు కేటాయించబడింది. ప్రస్తుతం ఈ భవనంలోని 2వ, 3వ, 4వ, 5వ అంతస్తులను తెలంగాణ సివిల్ సప్లై కార్పొరేషన్ అద్దెకు తీసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించగా, ఈ అద్దె ఒప్పందంపై ఇరుపార్టీల మధ్య MOUపై సంతకాలు జరిగాయి.

ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రైతాంగాన్ని కాపాడుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి అన్నారు. ఆంధ్రప్రదేశ్లో దీపం-2 పథకం కింద ఒక కోటి పది లక్షల లబ్ధిదారులకు సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర సివిల్ సప్లై అనుసంధానంతో ఈ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని వెల్లడించారు. ఎగుమతుల ప్రోత్సాహంతో రైతులకు నష్టం లేకుండా చూస్తామని పేర్కొన్నారు.సమావేశంలో చర్చించిన విషయాలు ఇరు రాష్ట్రాలకు ఉపయోగపడతాయని భావిస్తున్నాం... ఈ స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్లి మార్పు తీసుకొస్తాం అని మంత్రి నాదెండ్ల పేర్కొన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారంతో పౌర సరఫరాల వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# ఐఫోన్లు అమెరికాలోనే తయారుకావాలి, లేదంటే 25% సుంకం

- మొదటి పేజీ తరువాయి

ట్రంప్ ఆపిల్ సీఈఓ టిమ్ కుక్‌ను గట్టిగా హెచ్చరించారు. ఈ పరిణామం భారత్‌లో ఐఫోన్ల ఉత్పత్తిని పెంచాలనుకుంటున్న ఆపిల్ ప్రణాళికలకు ఆటంకం కలిగించేలా ఉంది."అమెరికాలో అమ్ముడయ్యే ఆపిల్ ఐఫోన్లు భారత్‌లోనో, మరే ఇతర దేశంలోనో కాకుండా అమెరికాలోనే తయారు కావాలని నేను చాలా కాలం క్రితమే టిమ్ కుక్‌కు తెలియజేశాను" అని ట్రంప్ శుక్రవారం తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఒకవేళ అలా జరగని పక్షంలో, ఆపిల్ సంస్థ అమెరికాకు కనీసం 25 శాతం సుంకం చెల్లించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ వార్తల నేపథ్యంలో ప్రీమార్కెట్ ట్రేడింగ్‌లో ఐఫోన్ తయారీ సంస్థ ఆపిల్ షేర్లు 3 శాతానికి పైగా పడిపోయాయి.చైనాపై ట్రంప్ విధించిన సుంకాల నేపథ్యంలో, ఆపిల్ సంస్థ తమ సరఫరా వ్యవస్థలను సర్దుబాటు చేసుకుంటూ ఐఫోన్ తయారీని భారత్‌కు మార్చాలని చూస్తోంది. ఈ ప్రణాళికే అమెరికా అధ్యక్షుడికి తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. గతవారం తన మధ్యప్రాచ్య పర్యటన సందర్భంగా కూడా ట్రంప్ ఈ విషయాన్ని ప్రస్తావించారు. "నిన్న నాకు టిమ్ కుక్‌తో చిన్న సమస్య వచ్చింది. ఆయన భారత్‌లో భారీగా ఉత్పత్తి చేస్తున్నారు. మీరు భారత్‌లో ఉత్పత్తి చేయడం నాకు ఇష్టం లేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. తమ చర్చల ఫలితంగా, ఆపిల్ అమెరికాలో ఉత్పత్తిని పెంచుతుందని ట్రంప్ తెలిపారు.ట్రంప్ తాజా వ్యాఖ్యలు, సుంకాలు మరియు భౌగోళిక రాజకీయ ఆందోళనల నేపథ్యంలో చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు వచ్చే ఏడాది చివరి నాటికి అమెరికాకు అవసరమైన ఐఫోన్లలో అధిక భాగాన్ని భారత్ నుంచి సేకరించాలన్న ఆపిల్ ప్రణాళికకు అడ్డంకిగా మారాయి. ఆపిల్ ప్రస్తుతం చాలా వరకు ఐఫోన్‌లను చైనాలోనే తయారు చేస్తోంది. అమెరికాలో స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తిని చేపట్టడం లేదు.కఠినమైన కోవిడ్ లాక్‌డౌన్‌ల కారణంగా తమ అతిపెద్ద ప్లాంట్‌లో ఉత్పత్తిని దెబ్బతిన్నప్పటి నుంచి ఆపిల్, దాని సరఫరాదారులు ప్రపంచంలోని రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనా నుంచి తమ కార్యకలాపాలను వేగంగా తరలిస్తున్నారు. భారత్‌లో తయారవుతున్న ఐఫోన్లలో ఎక్కువ భాగం దక్షిణ భారతదేశంలోని ఫాక్స్‌కాన్ టెక్నాలజీ

గ్రూప్ ఫ్యాక్టరీలో అసెంబుల్ అవుతున్నాయి. విస్ట్రాన్ కార్పొరేషన్ స్థానిక వ్యాపారాన్ని కొనుగోలు చేసి, పెగాట్రాన్ కార్పొరేషన్ కార్యకలాపాలను నిర్వహిస్తున్న టాటా గ్రూప్ ఎలక్ట్రానిక్స్ తయారీ విభాగం కూడా కీలక సరఫరాదారుగా ఉంది. టాటా, ఫాక్స్‌కాన్ సంస్థలు దక్షిణ భారతదేశంలో కొత్త ప్లాంట్లను నిర్మిస్తూ, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతున్నాయని బ్లూమ్‌బెర్గ్ న్యూస్ గతంలో నివేదించింది.

మార్చి వరకు గత 12 నెలల్లో ఆపిల్ భారత్‌లో 22 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్‌లను అసెంబుల్ చేసింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఉత్పత్తిని దాదాపు 60 శాతం పెంచింది. ట్రంప్ తాజా హెచ్చరికలతో ఆపిల్ భవిష్యత్ వ్యూహాలు ఎలా మారతాయో చూడాలి.

# సిగరెట్ల కంటే ఇవి లక్షల రెట్లు ప్రమాదకరం

**పెన్ పవర్ డెస్క్:**బెట్టింగ్ యాప్‌ల నియంత్రణ విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిందని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తెలిపారు. ఈ యాప్‌ల వల్ల జరుగుతున్న నష్టంపై కేంద్ర ప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన పాల్, బెట్టింగ్ యాప్‌ల ప్రమాదకర స్వభావంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఖబెట్టింగ్ యాప్‌ల వ్యసనం సమాజంలో పెను విషాదాన్ని నింపుతోందని కేఏ పాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యాప్‌ల కారణంగా వేలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన గుర్తుచేశారు. లక్షలు, కోట్ల రూపాయల అప్పుల ఊబిలో కూరుకుపోయి, వాటిని తీర్చలేక ఎంతోమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇలాంటి దారుణమైన ఆత్మహత్యలను నివారించడానికి ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నాయో వివరించాలని సుప్రీంకోర్టు తన నోటీసుల్లో ప్రశ్నించిందని పాల్ పేర్కొన్నారు."సిగరెట్ ప్యాకెట్లపై 'పొగతాగడం ఆరోగ్యానికి హానికరం' అని రాసి ఉంటుంది. కానీ, ఈ బెట్టింగ్ యాప్‌లు సిగరెట్ కంటే లక్షల రెట్లు ప్రమాదకరమైనవి" అని కేఏ పాల్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. సుమారు 1,100 మందికి పైగా సెలబ్రిటీలు కోట్ల రూపాయలు పారితోషికంగా తీసుకుని ఈ బెట్టింగ్ యాప్‌లను విచ్చలవిడిగా ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి యాప్‌ల వల్ల మరిన్ని ఆత్మహత్యలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పాల్ నొక్కిచెప్పారు.మనీలాండరింగ్ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలంటే, కేంద్ర ప్రభుత్వం తక్షణమే బెట్టింగ్ యాప్‌లను పూర్తిగా నిషేధిస్తూ ఒక పటిష్టమైన చట్టాన్ని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ యాప్‌లను ప్రమోట్ చేసిన కొందరు వ్యక్తులపై తెలంగాణలో కేసులు నమోదు చేసినప్పటికీ, వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని పాల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# జగన్ ప్రశ్నలకు బదులివ్వండి: కూటమి ప్రభుత్వంపై శైలజానాథ్ ధ్వజం

- మొదటి పేజీ తరువాయి

ఈనాడులో కథనం రాయించడం విడ్డూరంగా ఉందని శైలజానాథ్ అన్నారు. ఒకవైపు డేటా మొత్తం ధ్వంసమైందని చెబుతూనే, మరోవైపు బ్యాక్ ఎండ్ నుంచి సమాచారం సేకరించామని చెప్పడం, చేసిన తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నంగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానంలో అక్రమాలు జరిగాయని చెబుతున్నారని, అసలు డిస్టిలరీలకు అనుమతులు, వాటి సామర్థ్యం పెంపు ఎవరి కాలంలో జరిగాయో చెప్పాలని శైలజానాథ్ ప్రశ్నించారు. కేబినెట్ ఆమోదం లేకుండా రూ.1300 కోట్ల ప్రివిలేజ్ ఫీజు మాఫీ చేయడం, ముఖ్యమంత్రికి కావాల్సిన డిస్టిలరీలకు ఎక్కువ ఆర్డర్లు ఇవ్వడం వంటివి ఎవరు చేశారని నిలదీశారు. టీడీపీ హయాంలోని మద్యం వ్యవహారాలకు సంబంధించిన నోట్ ఫైళ్లపై చంద్రబాబు, నాటి మంత్రి కొల్లు రవీంద్ర సంతకాలున్నాయని, ఇప్పుడు చెబుతున్న కుంభకోణంలో తమ సంతకాలు ఎక్కడున్నాయో చూపాలని సవాల్ విసిరారు.

జగన్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, ఈనాడును అడ్డం పెట్టుకుని ప్రభుత్వం బురద చల్లే ప్రయత్నం చేస్తోందని శైలజానాథ్ మండిపడ్డారు. కోట్ల పేజీల సమాచారం తొలగించారంటూ ఈనాడు ఆశ్చర్యకరమైన కథనాన్ని ప్రచురించిందని, అదే సమయంలో బ్యాక్ ఎండ్ ద్వారా సమాచారం సేకరించి వేల కోట్ల అక్రమాలు జరిగాయని నిర్ధారించడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఒకవేళ సమాచారం నిజంగానే డిలీట్ అయితే బాధ్యులైన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ విభాగాల్లో సమాచారం ఒకచోట కాకపోతే మరోచోట ఉంటుందని, దాన్ని పూర్తిగా నాశనం చేయడం సాధ్యం కాదని, ఈ మాత్రం ఈనాడుకు తెలియదా? అని ఎద్దేవా చేశారు.

మద్యం కుంభకోణంపై కూటమి నేతలు ఒక్కొక్కరు ఒక్కో రకమైన లెక్కలు చెబుతున్నారని, వారి మాటల్లోనే పొంతన లేదని శైలజానాథ్ విమర్శించారు. చంద్రబాబు రూ.10 వేల కోట్లని, పురందేశ్వరి రూ.25 వేల కోట్లని, అచ్చెన్నాయుడు లక్ష కోట్లని, పవన్ కల్యాణ్ రూ.41 వేల కోట్లని, అసెంబ్లీలో చంద్రబాబు రూ.18 వేల కోట్లని, అదే రోజు పవన్ కల్యాణ్ రూ.30 వేల కోట్లని, ఎంపీ సీఎం రమేష్ రూ.30 వేల కోట్లని, ఎంపీ కృష్ణదేవరాయులు రూ.18 వేల కోట్లని ఇలా తలో మాట మాట్లాడారని, దీన్నిబట్టి అసలు కుంభకోణమే జరగలేదని స్పష్టమవుతోందని ఆయన అన్నారు.

# సుప్రీంకోర్టులో ఈ పద్ధతి మారాలి

- మొదటి పేజీ తరువాయి

పారదర్శకత విషయంలో మాజీ సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా (మే 13న పదవీ విరమణ చేశారు) తీసుకున్న చర్యలను జస్టిస్ ఓకా ప్రశంసించారు. "జస్టిస్ ఖన్నా పారదర్శకత మార్గంలో మనల్ని ముందుకు తీసుకెళ్లడం చాలా సంతోషంగా ఉంది. సుప్రీంకోర్టులోని ప్రతి న్యాయమూర్తిని విశ్వాసంలోకి తీసుకుని ఆయన నిర్ణయాలు తీసుకున్నారు. ఇక జస్టిస్ గవాయ్ రక్తంలోనే ప్రజాస్వామ్య విలువలు ఉన్నాయి" అని ఆయన అన్నారు.

న్యాయవ్యవస్థలో అగ్రస్థానంలో ఉన్న సుప్రీంకోర్టు, హైకోర్టులు విచారణ కోర్టులను (ట్రయల్ కోర్టులు) నిర్లక్ష్యం చేస్తున్నాయని జస్టిస్ ఓకా ఆవేదన వ్యక్తం చేశారు. "మన విచారణ, జిల్లా కోర్టులలో చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. విచారణ కోర్టును ఎప్పుడూ సబార్డినేట్ కోర్టు అని పిలవకండి. ఇది రాజ్యాంగ విలువలకు విరుద్ధం. 25 ఏళ్లుగా అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. అలహాబాద్ వంటి కోర్టులు సగం సంఖ్యతో పనిచేస్తున్నాయి. 20 ఏళ్ల తర్వాత ఒకరికి శిక్ష విధించడం చాలా కష్టమైన పని" అని ఆయన పేర్కొన్నారు.

**న్యాయమూర్తి పదవే జీవితం**


తన న్యాయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ, పదవీ విరమణ గురించి చాలా మంది తనను అడిగారని జస్టిస్ ఓకా తెలిపారు. "న్యాయమూర్తులకు న్యాయం చేసే స్వేచ్ఛ ఉంటుంది. మీరు న్యాయమూర్తిగా లేనప్పుడు ఆ స్వేచ్ఛ ఉండదు. 21 ఏళ్ల తొమ్మిది నెలల పాటు మూడు రాజ్యాంగ కోర్టులలో న్యాయమూర్తిగా పనిచేసిన తర్వాత, న్యాయమూర్తి పదవే జీవితం అవుతుంది, జీవితమే న్యాయమూర్తి పదవి అవుతుంది" అని ఆయన భావోద్వేగంగా అన్నారు. ఆర్థికంగా మరింత లాభదాయకమైన వృత్తిని వదిలి న్యాయమూర్తి అయినందుకు తనకు ఎలాంటి విచారం లేదని ఆయన స్పష్టం చేశారు. "విజయవంతమైన న్యాయవాది న్యాయమూర్తి అయినప్పుడు, వారు త్యాగం చేశారని అంటారు. నేను దీనిని అంగీకరించను. మీరు న్యాయవ్యవస్థలో చేరినప్పుడు, ఆ ఆదాయం రాకపోవచ్చు, కానీ మీకు లభించే పని సంతృప్తి ఒక న్యాయవాది ఆదాయంతో పోల్చలేనిది" అని ఆయన వివరించారు. "ఒకసారి మీరు న్యాయమూర్తి అయితే, రాజ్యాంగం, మనస్సాక్షి మాత్రమే మిమ్మల్ని నడిపిస్తాయి. న్యాయమూర్తిగా నా సుదీర్ఘ ప్రస్థానంలో, నేను ఎప్పుడూ భిన్నాభిప్రాయ తీర్పు ఇవ్వలేదు" అని జస్టిస్ ఓకా తెలిపారు.

# ఏపీలో మెగా డీఎస్సీకి లైన్ క్లియర్.. సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు

- మొదటి పేజీ తరువాయి

న్యాయస్థానం సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ కొందరు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. వివరాల్లోకి వెళితే, ఏపీలో డీఎస్సీ, టెట్ పరీక్షల షెడ్యూల్‌ను వాయిదా వేయాలని అభ్యర్థిస్తూ ఆరుగురు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం, అభ్యర్థులు లేవనెత్తిన అంశాల్లో తగిన కారణాలు కనిపించడం లేదని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఒకవేళ అభ్యర్థులకు ఏవైనా సమస్యలు ఉంటే, వాటి పరిష్కారం కోసం హైకోర్టును ఆశ్రయించవచ్చని ధర్మాసనం సూచించింది. ఫలితంగా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిన

డీఎస్సీ, టెట్ షెడ్యూల్ యథావిధిగా అమలవుతుందని స్పష్టం చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఏప్రిల్ 20న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విదితమే. ఈ నోటిఫికేషన్ ప్రకారం, జూన్ 6వ తేదీ నుంచి జులై 6వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) పద్ధతిలో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ఈ పరీక్షల నిర్వహణకు మార్గం సుగమమైంది.



## కొమరోలు రహదారి ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు

**గిద్దలూరు పెన్ పవర్ మే 23**

కొమరోలు మండలం తాటిచెర్ల మోటు వద్ద కారు లారీ ఢీకొని 6 మంది వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందడంపై ముఖ్యమంత్రి, చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు దైవ దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో ఇటువంటి దుర్ఘటన చోటు చేసుకోవటం అత్యంత బాధాకరమన్నారు ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలకు తన సంతాపం సానుభూతి తెలిపారు సహాయక చర్యలు చేపట్టాలన్నారు రోడ్డు ప్రంమాదంజరిగిన తీరు పై ఆరాతీశారు.

పెన్ పవర్ ప్రకాశం

### నేడు ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో

# నల్లబర్లి రైతులతో మంత్రుల ముఖాముఖి

**ఖరారైన మంత్రులు అచ్చెన్న,గొట్టిపాటి,ఏలూరి పర్యటన -పొగాకు రైతుల సమస్యపై ఏలూరి కృషి**
**సురవరపల్లి సమీపంలో పొలాల్లో క్షేత్రస్థాయి పొగాకు పరిశీలన**
**ఎంఎల్.ఎ.పి కంపెనీని సందర్శించనున్న మంత్రులు, ఎమ్మెల్యే ఏలూరి...**







**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మే 23**

నల్లబర్లి రైతులతో సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక కృషితో రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్ లు పర్యటించనున్నారు. ఎమ్మెల్యే ఏలూరి రైతు సమస్యలను వివిధ మార్గాల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. పొగాకు సమస్య పరిష్కారం కోసం గుంటూరులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో కంపెనీలు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాలకు మోనిటరింగ్ సెల్ ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో ప్రిన్సిపల్ సెక్రెటరీ రాజశేఖర్, కమిషనర్ ఢిల్లీ రావు పొగాకు పంటను పరిశీలించారు. క్యాబినెట్లో మంత్రుల సబ్ కమిటీ పొగాకు సమస్యపై చర్చించారు. తర్వాత జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో పొగాకు సమస్య తీవ్రతను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ప్రభుత్వం పొగాకు సమస్య పరిష్కారం కోసం చర్యలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లు రైతులు, కంపెనీ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో పొగాకు కొనుగోలు కార్యాచరణ పై ఈ కమిటీ కీలక నిర్ణయం తీసుకోనుంది.

**ఖరారైన మంత్రుల పర్యటన...**

సబ్ కమిటీ సభ్యులు రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్షేత్రస్థాయి పర్యటన ముఖాముఖిలో పాల్గొననున్నారు.

**షెడ్యూలు ఇలా.....**

రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్ లు ఉదయం 9 గంటలకు విజయవాడ బయలుదేరుతారు. 10 గంటలకు పర్చూరు నియోజకవర్గంలోని సురవరపల్లి సమీపంలోని కోయ కోల్డ్ స్టోరేజ్ (హైవే వద్ద) పొగాకు పొలాల వద్ద కు చేరుకుంటారు. అనంతరం నల్లబర్లీ పొగాకు మండెలను పరిశీలిస్తారు. ఉదయం 11.గంటలకు మార్టూరు పట్టణ పరిధిలోని నాగరాజు పల్లి రోడ్డులో ఎంఎల్.ఎ.పి (మద్ది లక్ష్మయ్య ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ) ని వద్దకు చేరుకుంటారు. అక్కడ పొగాకు పరిశ్రమను సందర్శిస్తారు. అనంతరం త్రెస్సింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్ తీరును పరిశీలిస్తారు. ఉదయం 11.30 గంటలకు ఎంఎల్ఏపి కంపెనీ నుంచి ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంకు బయలుదేరుతారు. ఉదయం11:40కి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంకు చేరుకుంటారు. అనంతరం రైతులు,పొగాకు పరిశ్రమలు ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం నల్లబర్లీ పొగాకు కొనుగోలు కార్యాచరణపై ప్రకటిస్తారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో భోజనం విరామం తర్వాత మధ్యాహ్నం 1.30 గంటలకు ఎమ్మెల్యే ఏలూరు క్యాంప్ కార్యాలయం నుంచి కడపకు బయలుదేరుతారు.




# గిద్దలూరు వైద్యశాలవద్ద విషాద ఛాయలు

**గిద్దలూరు పెన్ పవర్ మే 23**

కొమరోలు మండలం తాటిచెర్ల మోటు గ్రామ సమీపంలోని అమరావతి అనంతపురం జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం లో మృతుల ను పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు ఈనేపథ్యంలో మృతుల బంధువులు ఇక్కడికి చేరుకొని మృతుల ను చూసి లబోదిబోమంటుండంతో వైద్యశాల ప్రాంగణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దైవదర్శనానికి వెళ్లి తిరిగివస్తు లారీ, కారు ఢీకొన్న సంఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాల పాలయ్యారు . వారిని 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులలో ఇద్దరు మహిళలు నలుగురు పురుషులు ఉన్నారు. మృతులు బాపట్ల మండలం స్టువర్టుపురం గ్రామానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. మృతులు గజ్జల అంకాలు (40) గజ్జల భవాని (25) గజ్జల నరసింహులు (20) బొచ్చు సన్నీ (30) కర్రెద్దుల దివాకర్ (30) గజ్జల బబ్బులు (30) గజ్జల జనార్ధన్ (30) గా పోలీసులు తెలిపారు. గాయపడ్డ చిన్నారులలో జీతన్ పరిస్థితి విషమంగా ఉండటగా శిరీష కు తీవ్ర గాయాలయ్యాయి. వీరు ప్రస్తుతం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వ్యక్తిగత పనులపై మీరు నంద్యాల జిల్లా డోన్ కు వెళ్లి వస్తూ మహానంది శివయను దర్శించుకుని రోడ్డు ప్రమాదానికి గురయ్యారని విలపిస్తున్నారు. కారు డ్రైవర్ దివాకర్ నిర్లక్ష్యంగా కారు నడపడం వల్లే రోడ్డు ప్రమాదం జరిగిందని విచారణలో పోలీసులు గుర్తించినట్లు తెలుస్తుంది మృతదేహాలన్నిటిని పోస్టుమార్టం కొరకు గిద్దలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉంచారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలి

## రిమ్స్‌తో పాటు మాతా శిశు వైద్యశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్









**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మే 23**

రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలను, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జిజిహెచ్)ని ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను, చేపడుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. తొలుత జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మాతా శిశు వైద్యశాలను సందర్శించి, ఆసుపత్రిలోని ఓపి రిజిస్ట్రేషన్ విధానాన్ని సంబంధిత రిజిస్టర్స్ ను పరిశీలించారు. జనరల్ ఓపి వార్డును, ఎన్టిఆర్ వైద్య సేవల కౌంటర్ ను, ఆపరేషన్ థియేటర్ ను, ఫోస్ట్ నెటల్ వార్డు, కాన్పుల వార్డు, స్టెరిలైజేషన్ రూమ్ ను, యాంటినెటల్ వార్డు ను తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చేపడుతున్న మరమ్మతు పనులను పరిశీలించి తగు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలతోపాటు నిర్వహణ, పారిశుద్ధ్య ఏర్పాట్లు పై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్, వైద్యులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని (జీజీహెచ్) సందర్శించి ఆభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వివిధ వార్డులను, చేపడుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. పేషంట్స్ కు అందిస్తున్న భోజనం జిల్లా కలెక్టర్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల్లో అలసత్వాన్ని ప్రదర్శించారాదనీ జిల్లా కలెక్టర్ స్పష్టం చేసారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు సత్వరం వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, వైద్యులను ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ రోజు ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలను, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జిజిహెచ్)ను విజిట్ చేసి చేస్తున్న మరమ్మతు పనులను పరిశీలించడం జరిగిందన్నారు. మాతా శిశు వైద్యశాలలో ఎం ఎన్ బి యు యూనిట్ పనులు జరుగుచున్నవని, 10 రోజుల్లో సంబందిత పనులు పూర్తీ చేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగిందని తెలిపారు. అలాగే జిజిహెచ్ లో సదరం సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ కోసం వచ్చిన వారితో మాట్లాడటం జరిగిందని, వారు కూడా కొన్ని విషయాలను నా దృష్టికి తీసుకురావడం జరిగిందని, వచ్చిన రోగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా మెరుగైన వైద్య సేవలు అందిచేలా వైద్యులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అలాగే జిజిహెచ్ లో కూడా ఎం ఎన్ బి యు యూనిట్ పనులు పురోగతిలో వున్నాయని, పురోగతిలో వున్న మరమ్మతు పనులను సత్వరం పూర్తి చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. దేశంలో కొన్ని ప్రాంతాల్లో కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు అవుతున్న నేపధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, రద్దీ ప్రదేశాల్లో, సభలు, సమావేశాల సమయంలో తగిన దూరం పాటించడం, రద్దీ ప్రదేశాల్లో తిరిగేటప్పుడు మాస్కులు ధరించడం, ముఖ్యంగా చేతులను శుభ్రంగా కడుకోవడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరికైనా కరోనా లక్షణాలు కనుపడితే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామ స్థాయి నుండి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట డిసిహెచ్ఎస్ డా శ్రీనివాస నాయక్, మాతా శిశు వైద్యశాల సుపరింటెండెంట్ డా వెంకటరావు, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జిజిహెచ్) సుపరింటెండెంట్ డా ఏడుకొండలు, సంబంధిత ఆసుపత్రుల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# శారీరక శ్రమతో సంపూర్ణ ఆరోగ్యం

## మునిసిపల్ కమిషనర్ నారాయణరెడ్డి స్పష్టం





**పొదిలి, పెన్ పవర్, మే 23**

శారీరక శ్రమతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని పొదిలి నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డి చెప్పారు ఆయన శు క్రవారం ఉదయం పట్టణంలోని వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలసి మాట్లాడారు వాకర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి కమిషనర్ నారాయణరెడ్డి అడిగి తెలుసుకున్నారు విశ్వమంతా యోగాతో ఆరోగ్యం అనే నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రాధాన్యత గురించి ఆయన వివరించారు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన"యోగేంద్ర 20 25"గురించి కమిషనర్ నారాయణరెడ్డి తెలియజేశారు అలాగే జూన్ 21వ తేదీన రెండు కోట్ల మందితో సామూహిక యోగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విశాఖ నగరం ముస్తాబవుతుందని చెప్పారు ఈ కార్యక్రమం గురించి ప్రభుత్వం విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు అలాగే వచ్చేనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా పొదిలి జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేయబోతున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా వాకర్స్ అసోసియేషన్ కృషి చేయాలని కమిషనర్ నారాయణరెడ్డి కోరారు.

## నియోజకవర్గంలోని మీడియా మిత్రులకు అన్ని విధాలుగా అండగా ఉంటా - ఎమ్మెల్యే అశోక్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ మే 23**

గిద్దలూరు నియోజకవర్గంలోని మీడియా మిత్రులందరికీ అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి హామీఇచ్చారు ఒంగోలులోని డీ మార్ట్ ప్రక్కన ఎమ్ఎస్ కళ్యాణమండపంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ 6వ మహాసభకు లో పాల్గొన్న అశోకరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని పాత్రికేయుల అందరికి అన్ని విధాలుగా సహకరిస్తూ అండగా ఉంటానని పేర్కొన్నారు మీడియామిత్రులు, ఎటువంటి సహాయం కావాలన్న తనని సంప్రదించవచ్చని ఆయనపేర్కొన్నారు. మీడియా ప్రభుత్వానికి ప్రజలకు మద్య వారధి లాంటిదని, ఎండనక వాననక ఎల్లవేళలా వార్తా సేకరణ కోసం పనిచేస్తారని, వాస్తవాలను వెలుగులోకి తెచ్చేందుకు వారి కృషి ప్రశంశ నీయం అన్నారు.

## మన్నేపల్లి కార్తిక్ కు ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ కమిటీ ప్రతినిధులు



చంద్రశేఖరపురం, పెన్ పవర్ మే 23

చంద్రశేఖరపురం పట్టణంలోని డి జి పేట రహదారి సమీపంలో వెలసిన గంగమ్మ తల్లి తిరునాళ్ల సందర్భముగా ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికను మండల తెలుగు యువత నాయకులు పంచాయతీ వార్డు మెంబర్ మన్నేపల్లి కార్తీక్ కు దేవస్థాన కమిటీ నిర్వాహకులు అంద జేశారు. గంగమ్మ తల్లి దేవస్థానంలో జరుగునున్న ఉత్సవాలలో పాల్గొని అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో దేవస్థాన కమిటీ ప్రతినిధులు జిల్లా చీఫ్ సొసైటీ అధ్యక్షుడు తోడేటి గోపి, కుక్కల తిరుపతయ్య, ఆలా లక్ష్మయ్య, దిబ్బమడుగు రమణయ్య, ఇండ్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పొదిలిలో వివాహ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల



**పొదిలి, పెన్ పవర్, మే 23**

పొదిలిలో శుక్రవారం నాడు జరిగిన ఒక వివాహ కార్యక్రమంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు పట్టణంలోని కళ్యాణ మండపంలో జరిగిన ఇల్లూరి వివాహ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్, పొదిలి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి ఆవులూరి ఎల్లమంద తోపాటు పలువురు దేశం నాయకులు పాల్గొన్నారు.

## కాకు వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న దారపనేని

**పామూరు, పెన్ పవర్,మే23.**

కాకు సత్యనారాయణ, బాల వెంగమ్మ దంపతుల కుమారుడు హరికృష్ణ, కనపర్తి కొండలరావు, రమాదేవి దంపతుల ఏకైక కుమార్తె లక్ష్మీ సౌభాగ్యవతి సుదర్శిని ల వివాహ వేడుకలు విజయవాడలోని సాయి జ్యూయల్ నందు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకల్లో మానం మల్లికార్జున రావు దంపతులు, మానం కిరణ్ దంపతులు, మానం రాజకుమార్ దంపతులు, నూతలపాటి వెంకటేశ్వర్లు దంపతులు, రాములు దంపతులు, లక్ష్మణ దంపతులు, మర్రి నారాయణ దంపతులు, మానం వారి కుటుంబ సభ్యులు, నూతల పాటి వారి కుటుంబ సభ్యులు, మర్రి వారి కుటుంబ సభ్యులు, కాకు వారి కుటుంబ సభ్యులు, కనపర్తి వారి కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

## పొదిలిలో జగన్ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు





**పొదిలి, పెన్ పవర్, మే 23**

మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పొదిలి పర్యటన కోసం ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి జగన్మోహన్ రెడ్డి ఈనెల 28న పొదిలికి విచ్చేసి, స్థానిక పొగాకుబోర్డులోని వేలం కేంద్రాన్ని పరిశీలించడంతోపాటు పొగాకు రైతులతో మాట్లాడటం జరుగుతుంది జగన్ పర్యటన ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం నాడు జగన్ మోహన రెడ్డి ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాసనమండలి సభ్యులు తల శిల రఘురాం తో పాటు వైకాపా బృందం పొదిలి లో హే లి ప్యాడ్ స్థల పరిశీలన జరిపారు అలాగే జగన్మోహన్ రెడ్డి పొదిలిలో పర్యటనకు అవసరమైన ఏర్పాట్ల గురించి చర్చించారు ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, అన్నా రాంబాబు, ఒంగోలు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త చుండూరి రవి, మాజీ పి డి సి సి చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి, మాజీ సహకార సంఘం చైర్మన్ వై వెంకటేశ్వరరావు, రాష్ట్ర వైకాపా కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, స్థానిక వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొమరోలు మండలంలో జరిగిన ఘోరారు రోడ్డు ప్రమాదంపై దిగ్బ్రాంతి వ్యక్తం చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి

### క్షతగాత్రులైన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని సూచన.

### మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి.



**కొమరోలు పెన్ పవర్ మే 23**

ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాటిచెర్ల మోటు సమీపంలో శు క్రవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పై రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీవ్ర దిబ్రాంతిని సంతాపాన్ని తెలియజేసినట్లుగా కొమరోలు మండల వైసీపీ నాయకులు నాదెళ్ల వెంకగయ్య చౌదరి, జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు, ఎంపీటీసీ సభ్యులు షేక్ మౌలాలి షేక్ సుభాని ఎన్ తిరుపతి రాజు తెలిపారు. తాటిచెర్ల సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం ఎదురుగా వస్తున్న లారీని అతి వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి లారీని ఢీకొన్న ప్రమాదంలో బాపట్ల జిల్లా స్టువర్టుపురం గ్రామానికి చెందిన ఆరు మంది మృతి చెందారు .అదే ప్రమాదంలో మరో ఇద్దరు బాలికలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సంఘటన తీవ్ర దిగ్బ్రాంతిని ఆవేదనను కలిగిస్తున్నదని, శుభకార్యానికి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తూ ఆరు మంది వ్యక్తులు మృత్యువాత పడటం తీవ్ర ఆవేదనకుగురి చేసిందని జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నట్లుగా వారు తెలిపారు. కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయం అందించి ఆదుకోవాలనిమాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కోరినట్లుగా వారు తెలిపారు.

## తాటిచెర్ల లోని చర్చి అభివృద్ధికి 10వేల రూపాయలు విరాళాలు అందజేసిన బోనేని వెంకటేశ్వర్లు యాదవ్



**కొమరోలు పెన్ పవర్ మే 23.**

కొమరోలు మండలం తాటిచెర్ల లోని చర్చి అభివృద్ధికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ 10 వేల రూపాయలు విరాళాన్ని ప్రకటించి అందజేశారు. చర్చి నిర్వాహకులు వెంకటేశ్వర్లు యాదవ్ను కలసి చర్చి అభివృద్ధికి సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

అందుకు స్పందించిన వెంకటేశ్వర్లు యాదవ్ 10 వేల రూపాయలు విరాళాన్ని ప్రకటించి చర్చి నిర్వాహకులకు అందజేశారు. ఆ మేరకు చర్చి నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తూ వెంకటేశ్వర్లు యాదవుకు ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం క్రైస్తవుల అభివృద్ధికి చర్చిల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నదని అన్నారు. తనవంతుగా క్రైస్తవుల అభివృద్ధికి బడుగు బలహీన వర్గాల విద్యార్థుల అభివృద్ధికి వికలాంగులు వితంతువుల అభ్యున్నతికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తూ ఉంటానని వెంకటేశ్వర్లు యాదవ్ పేర్కొన్నారు .ఆ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు బోనీ అనిల్ కుమార్ ,రామ్మోహన్, చిన్నప్ప , పిచ్చయ్య, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాటిచెర్ల మోటు వద్ద రోడ్డు ప్రమాదం

ఎమ్మెల్యే అశోకరెడ్డి దిగ్భ్రాంతి

క్షతగాత్రుల మంచి వైద్యసేవలు అందించాలి

మృతుల కుటుంబాలకు సంతాపం

స్పదించి సహాయక చర్యలు చేపట్టిన పోలీసులకు అభినందనలు







**గిద్దలూరు పెన్ పవర్ మే 23**

మహానంది వెళ్లి శివయ్య దర్శించుకొని వెల్లుతున భక్తుల కార్ తాటిచెర్ల వద్ద లారీ ఢీకొనటం అందులో 6 గురు మృతి చెందటం తనను దిగ్భ్రాంతికి కి గురి చేసిందని గిద్దలూరు ఎమ్మెల్యే అశోకరెడ్డి తెలిపారు . ఇంత ఘోరారోడ్డు ప్రమాదం జరగటం విచారకరం అన్నారు. రోడ్డుప్రమాదంపై ఆయన ఆరాతీశారు. ఆప్రాంతం లో సహాయక చర్యలు చేపట్టాలని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రమాదంలో మరణించిన వారంతా స్టూవర్ట్ పురం వాసులు గా గుర్తిచారు. ఆకుటుంబాలకు ఎమ్మెల్యే తన సానుభూతి, సంతాపం తెలిపారు.

## ఆంజనేయస్వామిని దర్శించుకున్న కదిరి పార్ధసారథి

**చంద్రశేఖరపురం, పెన్ పవర్ మే 23**

హనుమాన్ జయంతి సందర్భంగా సిఎస్ పురం గ్రామంలో హైస్కూల్ సమీపంలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామిని శుక్రవారం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ - కరస్పాండెంట్ కదిరి పార్థ సారథి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తోట వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటిసి మూరం కాశిరెడ్డి,కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్,కళాశాల ఇంజినీర్ నిమ్మల శ్రీనివాసులు,నాగం పవన్, గంజరపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# తాటిచెర్ల మోటు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

అతివేగంతోలారీని ఢీకొన్న కారు -లారీ కిందికి దూది పోయిన కారు ముందు భాగం.

కారులోని ఎనిమిది మందిలో ఆరుగురు అక్కడికక్కడే మృతి -మృతులు, గాయపడిన ఇద్దరు చిన్నారులు బాపట్ల జిల్లా స్టువర్టుపురం వాసులుగా గుర్తింపు.

తీవ్రంగా గాయపడినఇద్దరు చిన్నారులను రక్షించి గిద్దలూరు ఆస్పత్రి తరలింపు - చిద్రమైన ఆరు మృతదేహాలు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన మార్కాపురం డిఎస్పి నాగరాజు, గిద్దలూరు అర్బన్ సిఐ సురేష్, కొమరోలు ఎస్సై జె నాగరాజు.

పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు. -కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న కొమరోలు ఎస్సై నాగరాజు.


















**కొమరోలు పెన్ పవర్ మే 23.**

ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాటిచెర్ల మోటు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడిన విషాద సంఘటన జరిగింది. పోలీసులు అందించిన వివరాలు మేరకు బాపట్ల జిల్లా స్టువర్టుపురం గ్రామానికి చెందిన గజ్జల అంకాలు (40) ,గజ్జల భవాని (25 ),గజ్జల నరసింహులు( 20) బొచ్చు సన్నీ (30) కర్రెద్దుల దివాకర్ (30) గజ్జల బబ్బులు( 30) గజ్జల జనార్ధన్ (30 )తో పాటు మరో ఇద్దరు చిన్నారులు ఇన్నోవా వాహనంలో కర్నూలు జిల్లా డోన్ లోని తమ బంధువుల ఇంట్లో జరిగిన వివాహ మహోత్సవానికి హాజరై శుక్రవారం ఉదయం తిరిగి బయలుదేరి వస్తూ,దారి మధ్యలో ఉన్న మహానంది శివ క్షేత్రాన్ని సందర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. అయితే డ్రైవర్ తాడిచెర్ల మోటు లో కారు డ్రైవర్ కారు ఆపి కూల్ డ్రింక్ తాగాడని పోలీసులు తెలిపారు. ఆ తరువాత అతి వేగంగా వెళుతున్న కారు తాటిచెర్ల సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద అదుపుతప్పి కుడివైపుకు వెళ్ళింది. అదే సమయంలో బేస్తవారిపేట వైపు నుంచి వస్తున్న లారీ ముందు భాగాన్ని కారు అతి వేగంగా ఢీకొన్నది. ఆ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా లారీ కిందికి దూరిపోయింది. ఆ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు చిన్నారులు తప్ప మిగిలిన 6 మంది అక్కడికక్కడే మృతి చెందారు .సమాచారం అందుకున్న కొమరోలు గిద్దలూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని జెసిబి, కట్టర్ల సహాయంతో లారీ ముందు భాగం కింద చిక్కుకుపోయిన కారును అతి కష్టం మీద బయటకు తీశారు .కారులోని శవాలు గుర్తుపడ్డానానికి వీలు లేకుండా నుజ్జు నుజ్జు అయ్యాయి. కారు వెనుక సీటులో చిక్కుకొని కేకలు వేస్తున్న ఇద్దరు బాలికలను పోలీసులు సురక్షితంగా బయటకు తీసి వారిని గిద్దలూరు ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని మార్కాపురం డిఎస్పి నాగరాజు, గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్, కొమరోలు ఎస్ఐ నాగరాజు, ఏఎస్ఐ పవన్ కుమార్ తో పాటు కొమరోలు గిద్దలూరు పోలీసులు సహాయ చర్యలు పాల్గొన్నారు. కారు డ్రైవర్ నిద్ర మత్తులోనికి జారటమో లేక సెల్లో మాట్లాడుతూ ఉంటామో జరిగి ఉంటుందని, దీనితో అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు కుడి వైపుకు వెళ్లి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొనడంతో ఘోర ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. కారులో చిక్కుకొని చిత్రమైన ఆరు మృతదేహాలను అతి కష్టం మీద వెలికి తీసి వాటిని పోస్మార్టం నిమిత్తం గిద్దలూరు ఆస్పత్రికి తరలించారు .గాయపడిన ఇద్దరు బాలికలు జీతన్, శిరీష గిద్దలూరు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే భయపడిన లారీ డ్రైవర్ లారీ దిగి పారిపోయాడని పోలీసులు తెలిపారు. తాటిచెర్ల మోటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదాన్ని సంబంధించి కేసు నమోదు చేసి మార్కాపురం డిఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లుగా కొమరోలు ఎస్సై నాగరాజు తెలిపారు.

## గడ్డివాముకు నిప్పు... తప్పిన ప్రమాదం...






**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మే 23:**

పట్టణంలోని నెహ్రూ నగర్లోనీ మసీదుకు కూత వేటు దూరంలో ఉన్న గడ్డివాముకు నిప్పంటుకుంది. దీనిని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చిన అగ్నిమాపక సిబ్బంది , సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపిన యజమాని.

## సొంత నిధులతో వంతెన నిర్మాణం

**జన్మదినం సందర్భంగా ప్రారంభం**









**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మే 23:**

బాపట్ల నియోజకవర్గం శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ మరొక్క సారి వారి గొప్ప మనసు చాటుకున్నారు బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ సుబ్బారెడ్డి పాలెం గ్రామంలో గతం లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పర్యటించినప్పుడు గ్రామస్తులు నరేంద్ర వర్మ గారికి గ్రామంలో సమస్యలను తెలియచేస్తూ ప్రధాన సమస్యగా ఉన్న వెస్ట్ బాపట్ల ఛానల్ మీద బ్రిడ్జి నిర్మించాలని కోరగా ఆనాడు కూటమి ప్రభుత్వం అధికారం లోకి వస్తే తప్పకుండ వంతెన నిర్మాణం చెప్పడతాము అని మాట ఇచ్చారు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పి4 కార్యక్రమంలో భాగంగా నేడు సొంత నిధులు తో సుబ్బారెడ్డి పాలెం గ్రామస్తులకు ఇచ్చిన మాట ప్రకారం వంతెన ఏర్పాటు చేసారు. ఈ వంతెన ఏర్పాటు తో పడమర బాపట్ల పంచాయతీల్లో డంపింగ్ యార్డ్ కి ఎటువంటి సౌకర్యం లేనందువలన ఈ బ్రిడ్జి నిర్మాణం ద్వారా డంపింగ్ యార్డ్ కి సుఖమయం అయినది మరియు గతం లో గ్రామస్తులు రాకపోకల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనగా నేడు వారి ఇబ్బందులు అన్ని తిరిపోయాయి అదే విధంగా ఈ వంతెన ఏర్పాటు ఎంతో ఉపయోగకరమని గ్రామస్తులు గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు మరియు 35 సంవత్సరాల కల నెరవేర్చిన బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేయించి వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కావూరి శ్రీనివాస్ రెడ్డి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### నారాయణపూర్ ఎన్ కౌంటర్ పై

# సుప్రీంకోర్టు సుమోటో కేసు నమోదు చేయాలి

**అమరుల బంధుమిత్రుల సంఘం డిమాండ్**

**సజ్జా కుటుంబాన్ని పరామర్శించిన ప్రజా సంఘాలు**

**మృతదేహాలను భద్రపరచాలనీ డిమాండ్**





**చీరాల,పెన్ పవర్,మే 23**

ప్రజా ఉద్యమంలో అమరులైన వారి వారి కుటుంబ సభ్యులకు అందజేయకపోవడం ప్రజాస్వామిక విరుద్ధమని ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దేశ పౌరులను హత్య చేయడంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయమూర్తి సుమోటోగా స్వీకరించి నారాయణపూర్ జిల్లా మాడ్ అటవీ ప్రాంతంలో జరిగినట్లుగా చెబుతున్న ఎన్కౌంటర్ పై న్యాయ విచారణ జరపాలని ప్రజా సంఘాల డిమాండ్ చేశాయి. అమరుల బంధుమిత్రుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం చీరాల మండలం జాండ్రపేట గ్రామంలో నాగేశ్వరరావు సోదరుని ఇంటికి వెళ్లిన ప్రజా సంఘాల ప్రతినిధులు అమరుడు నాగేశ్వరరావు సోదరుడు సజ్జా శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అమరుల బంధుమిత్రుల సంఘం నాయకులు అంజమ్మ మీడియాతో మాట్లాడుతూ, మే 20వ తేదీ మరణించిన అమరుల మృతదేహాలను భద్రపరచకుండా కాలయాపన చేస్తూ శరీరం కుళ్ళిపోయే విధంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం మరణించిన ఉద్యమకారుల పైన కూడా హింసను ప్రయోగిస్తుందని, అమరుల కుటుంబ సభ్యులను వేధింపులకు గురి చేస్తుందని ఆమె పేర్కొన్నారు. మతం పేరుతో కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మృతుల కుటుంబాలు నిర్వహించే అంతిమ సంస్కార సంప్రదాయాలను జరుపుకోవడానికి మృతదేహాలను అప్పగించకపోవడం హిందూ సాంప్రదాయానికి విరుద్ధమనీ ఆమె తెలిపారు. విప్లవ రచయితల సంఘం నేత అరసవల్లి కృష్ణ మాట్లాడుతూ, మధ్య భారత దేశంలో జరుగుతున్న ఆపరేషన్ కగార్ ను తక్షణమే నిలిపివేయాలని, ఆదివాసీలపై కొనసాగుతున్న సైనిక చర్యల ద్వారా మానవహననం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టు పార్టీ ప్రతినిధులు పలుమార్లు శాంతి చర్చలకు సిద్ధమని అందులో భాగంగా కాల్పుల విరమణ ప్రకటించినప్పటికి ఏకపక్షంగా సైనిక చర్యలకు పాల్పడుతూ దేశంలో భయానిక పరిస్థితులను కేంద్రం సృష్టిస్తోందన్నారు. రాష్ట్ర చేనేత జన సమాఖ్య వ్యవస్థాపకులు డాక్టర్ మాచర్ల మోహన్ రావు మాట్లాడుతూ, 1/70, పీసా చట్టం రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం గిరిజన హక్కులు కాపాడుకోవడం కోసం జరుగుతున్న ఆదివాసి ఉద్యమాలను అణిచివేయడం ద్వారా విదేశీ బహుళ జాతి సంస్థలకు లక్షల కోట్ల విలువైన అటవీ ఖనిజ సంపదలను దారాదత్తం చేయడానికి కేంద్రం చేస్తున్న కుటిల ప్రయత్నమే ఆపరేషన్ కగార్ అనీ, ఆపరేషన్ కగార్ ను దేశ ప్రజలు వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 355 ప్రకారం కేంద్ర ప్రభుత్వానికున్న తన విశేష అధికారాన్ని ఉపయోగించి అంతర్గత అశాంతిని పరిష్కరించేందుకు చట్ట పరిధిలో చర్చలను కొనసాగించకపోగా, పలుమార్లు చర్చలకు మావోయిస్టులు ప్రతిపాదనలు చేసినప్పటికీ ఏకపక్షంగా వ్యవహరిస్తూ అంతమొందించడమే ధ్యేయంగా, దేశ సంపదలను కొల్లగొట్టి, విదేశీ సంస్థలకు అప్పగిస్తూ దేశ పౌరులను కిరాతకంగా హత్య చేస్తూ దేశభక్తిగా ప్రకటించుకోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు.

**ఇప్పటివరకు సమాచారం లేదు: సజ్జా సోదరుడు**

నారాయణపూర్ జిల్లా మాడ్ ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పులలో మృతి చెందిన మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, మిలటరీ పత్రిక ఇంచార్జ్ సజ్జా వెంకట నాగేశ్వరరావుట మధుటనవీన్టఏసన్నటరాజన్న సోదరుడు సజ్జా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈరోజు వరకు ప్రభుత్వం నుండి మా సోదరుడు మరణించిన విషయంగాని మృతదేహాన్ని తీసుకు వెళ్ళవలసిందిగా సమాచారంగానీ ఇచ్చి ఉండలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మానవత్వంతో ఆలోచించి వెంకట నాగేశ్వరరావు మృతదేహాన్ని మా కుటుంబానికి అందజేయాలని స్థానిక రెవెన్యూ పోలీసు అధకారులను కోరినట్లు తెలిపారు, ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సహకరించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలోప్రగతి శీల కార్మిక సమాఖ్య కొండారెడ్డి, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు వై.వెంకటేశ్వరరావు, బహుజన సమాజ్ ;పార్టీ నేత పి.పుల్లయ్య, రాష్ట్ర చేనేత జన సమాఖ్య నాయకులు దేవన వీర నాగేశ్వరరావు, బిసి ఫెడరేషన్ నాయకులు ఊటుకూరు వెంకటేశ్వర్లు, జ్యోతిర్మయి దేవాంగ సమితి బీరక పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలు నగరంలో రాజమాత అహల్యా బాయి హోల్కర్ విగ్రహం ప్రతిష్టకు వినతిపత్రం

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, బాపట్ల, మే 23**

భారతీయ మహిళలకు స్ఫూర్తిదాయకమైన నాయకురాలు, ప్రజాహిత నాయికగా పేరొందిన రాజమాత అహల్యాబాయి హోల్కర్ విగ్రహాన్ని ఒంగోలు పట్టణ పరిసర ప్రాంతాల్లో ప్రతిష్టించాలని అమ్మా ఫౌండేషన్ అధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్‌కు విగ్రహ ఆవిష్కరణ కోసం అవసరమైన స్థలం కేటాయింపు మరియు అనుమతుల మంజూరును కోరుతూ అమ్మ ఫౌండేషన్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బీ. విజయరావు వినతిపత్రాన్ని అందజేశారు. భావితరాలకు రాజమాత చేసిన సేవలు చాటిచెప్పేలా ఈ విగ్రహం ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మీడియా కన్వీనర్ దనిశెట్టి రాము, బీజేపీ జిల్లా కార్యదర్శి తీగల సత్యవతి, బీజేపీ మండల అధ్యక్షురాలు దేవరపల్లి శ్రీలక్ష్మి, బీజేపీ ధార్మిక



సెల్ కన్వీనర్ సీతారామయ్య, విశ్వ హిందూ పరిషత్ ప్రముఖులు సోమ సుబ్బారావు, ఈమని బలరాం తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

# కృష్ణా జిల్లాను అభివృద్ధికి కేంద్రంగా మారుద్దాం...

**తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడేలా టీడీపీ నిర్మాణం**

**తెలుగు వారి సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిన చంద్రబాబు.!**

**గ్రామ స్థాయి కమిటీల నిర్మాణమే తెలుగుదేశం పార్టీ బలం**

**విద్య, ఉద్యోగ, ఉపాధి కేంద్రంగా కృష్ణా జిల్లాను మారుద్దాం.**

**కృష్ణా జిల్లా మినీ మహానాడులో మంత్రి కొల్లు రవీంద్ర.**

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, మే, 23:**

తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి అయితే.. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు అతిపెద్ద పండుగ మహానాడు అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు, మచిలీపట్నం శాసనసభ్యులు కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలో నిర్వహించిన కృష్ణా జిల్లా మినీ మహానాడు వేడుకలో పార్లమెంటు అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీకి ఉన్న సంస్థాగత నిర్మాణం ప్రపంచంలో ఏ రాజకీయ పార్టీకి లేదు. ఆరోజు అన్న నందమూరి తారక రామారావు నిర్ణయం మేరకు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకున్నాం. నాటి నిర్ణయం ఫలితంగా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా కార్యకర్తలు అండగా నిలిచారు. ఎంత మంది నాయకులు పార్టీని వీడినా కార్యకర్తలు పార్టీని వీడలేదు. తెలుగుదేశం అనేది నాయకులను తయారు చేసే ఫ్యాక్టరీ. నాడు అన్న ఎన్టీఆర్ తెలుగు ఆత్మగౌరవం నినాదంతో ముందుకు వెళ్తే.. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగువారిని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలపాలని శ్రమిస్తున్నారు. గత ఐదు సంవత్సరాలు తెలుగుదేశం పార్టీపై కక్ష గట్టి వేధింపులకు పాల్పడ్డాడు. కానీ కార్యకర్తల నిబద్ధత కారణంగా మళ్లీ అధికారంలోకి వచ్చాం. కుటుంబ సాదికార సారధుల నియామకం ద్వారా గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. తద్వారా రాబోయే కాలమంతా తెలుగుదేశం పార్టీదే. 2024 ఎన్నికల్లో అప్రజాస్వామిక పాలనను ప్రజలు, కార్యకర్తలు తరిమికొట్టాం. 2029 ఎన్నికల్లో మళ్లీ గెలిచి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించుకునేలా చేసుకోవాలి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. పెన్షన్లు, అన్న క్యాంటీన్లు అమలు చేస్తున్నాం. త్వరలోనే తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీ భవ పథకాలను ప్రారంభించబోతున్నాం. ఈ కార్యక్రమాల గురించి ప్రతి ఇంటికీ వివరించాలి. సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా.. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల్ని ఏర్పాటు చేసుకుంటున్నాం. మద్యం కుంభకోణంలో అంతా బయటపడేసరికి.. దిక్కుతోచక మనపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. జగన్ మోహన్ రెడ్డి అరాచకాలను, తప్పుడు ఆరోపణలను

















తిప్పికొట్టి ముందుకు వెళ్లాలి. పెడన రోడ్డులో 2 ఎకరాల్లో జిల్లా పార్టీ కార్యాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. వచ్చే ఏడాది మహానాడును ఆ కొత్త పార్టీ కార్యాలయంలో నిర్మించుకుంటాం. ఏడు నియోజకవర్గాల నుండి కార్యకర్తలు, నాయకులు ముందుకు వస్తే నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకుందాం. కృష్ణా జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు అడుగులు వేయాలి. మరోవైపు.. కృష్ణా జిల్లాను సీఆర్డీఏలో విలీనం చేయడం ద్వారా మరింత అభివృద్ధి సాకారం అవుతుంది. అందుకోసం అవసరమైతే ఎమ్మెల్యేలంతా ముఖ్యమంత్రిని కోరుదాం. మల్లవల్లిని అభివృద్ధి చేసుకుంటూ.. పారిశ్రామికాభివృద్ధికి చర్యలు చేపట్టాం. విజయవాడ మచిలీపట్నం రోడ్డు 6 లైన్లతో అభివృద్ధి చేయబోతున్నాం. అదే సమయంలో బందరు పోర్టు నుండి అమరావతికి ఇన్లాండ్ వాటర్ వేస్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా మరింత అభివృద్ధికి ఆస్కారం లభిస్తుంది. ఇన్లాండ్ వాటర్ వే నిర్మాణానికి అవసరమైన నిధుల్ని కేంద్రం నుండి తెప్పించుకునేలా చర్యలు తీసుకుంటాం. బందరుకు ప్రధాన తాగునీటి వనరైన బందరు కాలువలో మురుగు చేరుతున్న నేపథ్యంలో.. కృష్ణా నది నుండి బందరు వరకు పైపులైన్ల నిర్మాణానికి ఏర్పాట్లు చేయాల్సిందిగా మంత్రి కొల్లు రవీంద్ర ప్రతిపాదించారు. కృష్ణా జిల్లా చరిత్రను నాశనం చేసేలా కొంత మంది వ్యవహరించారు. బందరులో ఉన్న ఓ పందికొక్కు పేదల బియ్యం తినేసి.. సిగ్గులేకుండా బొంకుతున్నాడు. అలాంటి వారికి నడిరోడ్డుపై బుద్ధి చెప్పాలి. గుడివాడకు చెందిన గూండా గుండె నొప్పి అంటూ బెయిల్ తెచ్చుకున్నాడు. రంగులేసుకుని తిరిగే మరో వ్యక్తి అసలు రంగు బయటకొచ్చింది. కొత్త కమిటీలు, పాత నాయకత్వం కలిసి ముందుకు వెళ్దాం. కష్టబడి పని చేసిన ప్రతి ఒక్కరికీ పదవులు లభిస్తాయి. త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీలు, మున్సిపాలిటీలను నూటికి నూరు శాతం గెలిపించి తెలుగుదేశానికి కృష్ణా జిల్లా కంచుకోట అని మరోసారి నిరూపిద్దామని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

### ప్రజావేదికలో మాజీమంత్రి ప్రత్తిపాటికి ఫిర్యాదు చేసిన మాబు సుభాని..

# స్థానికులు, రైస్ మిల్ యజమాని సుబ్బారావు

మున్సిపల్ నిధుల స్వాహాలో విడదల రజనీ పాత్రపై సమగ్ర విచారణ జరిపించండి

రూ.35 లక్షల పురపాలకసంఘ నిధుల గోల్ మాల్ లో రజనీ, ఆమె మరిది గోపీలే అసలు లబ్ధిదారులు

జీతంపై బతికే సాధారణ ఉద్యోగుల్ని సస్పెన్షన్ పై పునరాలోచన చేయండి -ప్రజల సొమ్ము కాజేసిన గంగా భవానీ ఆమె భర్త పవన్ రజనీ కీలక అనుచరులు.

వారిని విచారిస్తే రజనీ, ఆమె మరిది గోపి పాత్ర, ప్రమేయం బయటపడుతాయి -రైస్ మిల్ పై రేకులు వేసుకోవడానికి రజనీ మరిది రూ.15 లక్షలు కట్టమన్నాడు







**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మే 23:**

ఇటీవల చిలకలూరిపేట మున్సిపాలిటీలో వెలుగుచూసిన నిధుల స్వాహాలో మాజీమంత్రి రజనీ, అమె మరిది గోపిలే అసలు దోషులని, వారి పాత్ర, ప్రమేయం తేలాంటే నిదులు కాజేసి పరారైన ఇక్కుర్తి గంగాభవాని, ఆమె భర్త పవన్ లను విచారించాలని స్థానికుడు షేక్ మాబు సుభాని మరియు స్థానికులు మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుని కోరారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాజీమంత్రి ప్రత్తిపాటి ప్రజావేదిక నిర్వహిం చారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలు స్వీకరించిన ఆయన, వాటి పరిష్కారంపై వెంటనే అధికారులతో మాట్లాడారు. వైసీపీ హాయాంలో నియోజకవర్గంలో విచ్చలవిడి అవినీతికి పాల్పడిన విడదల రజనీ, ఆమె మరిది గోపి, అనుచరులపై వచ్చిన ఫిర్యాదుల్ని క్షుణ్ణంగా పరిశీలించిన ప్రత్తిపాటి, సమగ్ర విచారణ జరిపించి అవినీతిపరులకు శిక్ష పడేలా చూస్తానని ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు.

**మున్సిపాలిటీ నిధుల స్వాహాలో అసలు దొంగలు విడదల రజనీ..ఆమె మరిది గోపీనే...:** కూటమిప్రభుత్వం ఏర్పడ్డాక చిలకలూరిపేటలో వెలుగుచూసిన రూ.35లక్షల నిధుల గోల్ మాల్ వ్యవహారంలో అసలు దోషులు రజనీ, ఆమె మరిది గోపీలేనని పట్టణవాసులు షేక్ మాబు సుభాని తదితరులు ఎమ్మెల్యే ప్రత్తిపాటికి ఫిర్యాదుచేశారు. నిధుల స్వాహాకు పాల్పడి పరారైన శ్రీమతి ఇక్కుర్తి గంగాభవాని, ఆమె భర్త పవన్ లు రజనీకి కీలక అనుచరులని, వారిని పట్టుకొని విచారిస్తే మాజీమంత్రి, ఆమె కుటుంబసభ్యుల పాత్ర బయటకు వస్తాయని ఫిర్యాదుదారు సుభాని ప్రత్తిపాటికి తెలియచేశారు. నిధుల వ్యవహారంలో ప్రభుత్వం 17 మంది మున్సిపల్ సిబ్బందిపై చర్యలు తీసుకుందని, అసలు దోషుల్ని కనిపెట్టి శిక్షించాక, ఉద్యోగుల సస్పెన్షన్ పై పునరాలోచన చేయాలని సుభాని మరియు స్థానికులు తమ ఫిర్యాదు లో కోరారు. ఫిర్యాదును పరిశీలించిన ప్రత్తిపాటి.. ప్రజలసొమ్ము కాజేసిన వారు ఎవరైనా, ఎంతటివారైనా ఎక్కడున్నా గుర్తించి తగిన శిక్షలు పడేలా చూస్తామని, తప్పుచేయని వారు భయపడాల్సిన పనిలేదని స్పష్టంచేశారు.

**రేకులు వేయాలంటే రూ.15లక్షల ఇవ్వాలని బెదిరించారు**

వైసీపీ ప్రభుత్వంలో తన రైస్ మిల్లుపై రేకులు వేసుకుంటుంటే, అప్పటి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సునీత పనులు ఆపి, అప్పటి మంత్రి విడదల రజనీని కలిసి మాట్లాడుకోవాలని తనను బెదిరించారని ఇంటూరి సుబ్బారావు శుక్రవారం మాజీమంత్రి ప్రత్తిపాటికి చెప్పారు.. తాము కొత్తగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని, పాడైపోయిన పాత రేకుల స్థానంలో కొత్తవి వేసుకుంటున్నామని, దానికి రజనీని ఎందుకు కలవాలని అప్పట్లో ప్రశ్నిస్తే తనను భయపెట్టారని సుబ్బారావు చెప్పారు. నెలరోజులు పనులు ఆపడంతో చివరకు చేసేదేం లేక రజనీ మరిది విడదల గోపిని కలిస్తే, తమకు రూ.15లక్షలు ఇచ్చి రేకులు వేసుకోవాలని చెప్పాడని ఫిర్యాదుదారు సుబ్బారావు ప్రత్తిపాటికి తెలియచేశారు. అంత డబ్బు ఇవ్వలేనని కాళ్లావేళ్లా పడి బతిమాలితే చివరకు రూ.8లక్షలు ఇవ్వాలని, లేకుంటే రైస్ మిల్ కూడా నడవనివ్వమని గోపి బెదిరించడంతో ఆ మొత్తం సొమ్ము ఇచ్చి పని పూర్తిచేసుకున్నానని ప్రత్తిపాటికి చెప్పుకొని సుబ్బారావు వాపోయారు. ఆనాడు తనను ఇబ్బంది పెట్టిన వారిని ఏమీ చేయలేకపోయానని, కూటమిప్రభుత్వంలో న్యాయంచేస్తారనే ఫిర్యాదు చేస్తున్నానని, తన సమస్యపై తగిన విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని బాధితుడు సుబ్బారావు, ప్రత్తిపాటిని అభ్యర్థించారు. నాడు జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలు తెలుసుకొని సుబ్బారావుని ఇబ్బందిపెట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాటి పోలీస్ వారిని ఆదేశించారు. ప్రజావేదిక కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ టీడీపీ కరీముల్లా, జవ్వాజి మధన్ మోహన్, పఠాన్ సమాధ్ ఖాన్, మద్దుమలా రవి, కందుల రమణ, తదితరులున్నారు.



## వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలువలను శుభ్రపరచాలి

**- ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**పెన్ పవర్ గుంటూరు మే 23**

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న కాలువలను మున్సిపల్ సిబ్బంది వెంటనే శుభ్రపరచాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు. గతంలో వర్షాకాలంలో నీళ్లు ఇళ్లలోకి చేరటం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, మురుగు నీరు నిలబడకుండా, సిల్టేషన్ తొలగింపు పనులు ప్రారంభించాలన్నారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, వాటిని పరిష్కరిచవలసినదిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల్ని పరిష్కరించటమే తన ధ్యేయం అని, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయము తోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలో కొన్ని కరోనా కేసులు నమోదు అయ్యాయని దానిని దృష్టిలో ఉంచుకొని, ప్రజలు వ్యక్తిగత దూరం పాటిస్తూ, అవసరమయిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో జగన్ రెడ్డి %ఇ% కో ఇష్టానుసారం దోచుకుని తిని నేడు ప్రజల ముందు కళ్ళు ఆర్పకుండా అబద్ధాలు చెప్పే ఘనుడు జగన్ మోహన్ రెడ్డి అని, ఆయనను ఎవరూ విశ్వసించరని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి పాల్గొన్నారు.

# మినీ మహానాడుకు భారీగా తరలిన తెలుగుదేశం శ్రేణులు...



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, మే, 23:**
మచిలీపట్నం లో జరుగుతున్న జిల్లా స్థాయి మినీ మహానాడుకు అవనిగడ్డ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం శ్రేణులు భారీగా తరలి వెళ్ళాయి.. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అవనిగడ్డ ప్రధాన సెంటరు నుంచి ర్యాలీగా మచిలీపట్నం తరలి వెళ్లగా సీనియర్ తెలుగుదేశం నాయకులు, ఏఎంసి, చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మెండు లక్ష్మణరావు, సైక%ళి% జగదీష్, బండే రాఘవ, సిరివెళ్ల నాగరాజు, ముమ్మారెడ్డి రాజశేఖర, తాడేపల్లి పాపారావు, తదితరులు ర్యాలీ కి నేతృత్వం వహించారు.

# నాగార్జున సాగర్ కుడి కాలువకు తాగునీరు విడుదల



**కారంపూడి పెన్ పవర్ మే 22**
నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువకు గురువారం అధికారులు తాగునీటి ని విడుదల చేశారు.కృష్ణానది యాజమాన్య బోర్డు అదేశాలతో కుడికాలువ 2,3 వ గేట్ల ద్వారా 5,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.తాగునీటి అవసరాల నిమిత్తం 4 టీఎంసీల నీటిని రోజుకు 5,500 వేల క్యూసెక్కుల చొప్పున 8 రోజుల పాటు విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.కుడి కాలువ పరిధిలోని చెరువులను,కుంటలను నింపుకొని తాగునీటి అవసరాలకు వాడుకోవాలని అధికారులు సూచించారు.

# అబ్దుల్ కలాం ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మే 23**
అబ్దుల్ కలాం ఫౌండేషన్ కర్లపాలెం ద్వారా ప్రతి శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఫౌండేషన్ ప్రెసిడెంట్ ,గ్రామ ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాష తెలిపారు.కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్లపాలెం ఎంవిరాజుపాలెంలోని ముగ్గురు నిరు పేద మహిళలకు చీరెలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పఠాన్ అహ్మద్ బాష మాట్లాడుతూ పేదలకు ప్రతి శుక్రవారం బియ్యం ,నిత్యావసర సరుకులు ,దుప్పట్లు ,అనారోగ్యంగాఉన్న వారికి ఆర్థిక చేయూత అందించడం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి ,మాజీ ఎంపీటీసీ బాజి,మాజీ కో ఆప్షన్ సభ్యులు బాష,పఠాన్ ఖాజా మోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# యడ్లపాడు-1 సచివాలయాన్ని సందర్శించిన తహశీల్దార్

## రేషన్ కార్డులపై క్షేత్రస్థాయి పరిశీలన

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మే 23**
యడ్లపాడు : మండల తహశీల్దార్ జెట్టి విజయశ్రీ గురువారం యడ్లపాడు-1 సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియపై అక్కడి సిబ్బందితో సమావేశమై దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, అర్హత నిర్ణయం తదితర ప్రక్రియలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేయాలని, అనర్హుల వద్ద నుంచి పథకాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉందన్న విషయాన్ని విస్మరించ వద్దన్నారు. రేషన్‌కార్డుల మంజూరుపై సిబ్బందికి స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఆమె వెంట ఉపతహశీల్దారు అనురాధ, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుబ్బారావు, వీఆర్వో కేపి చారి, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-6 స్వాతిప్రియ, జీఎంఎస్‌కే రేవతి తదితరులు ఉన్నారు.



# గత ప్రభుత్వ నిర్ణయంతో మూడు గ్రామాలకు జరిగిన నష్టాన్ని భర్తీచేస్తాం

**రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ**

చిలకలూరిపేట నియోజకవర్గం నాదెండ్ల మండలం గణపవరంలో తాగునీటి శాండ్ ఫిల్టర్ బెడ్లు పరిశీలించిన కమిషనర్.

బెడ్లు శుభపరిచి ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని అధికారులకు ఆదేశం

మూడు గ్రామాల మున్సిపాలిటీ విలీన సమస్యని నెలరోజులో పరిష్కరించి, ఆయా గ్రామాల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామన్న కృష్ణతేజ

గ్రామాల్లోని సమస్యల పరిష్కారంపై అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది వెంటనే దృష్టి పెట్టి గ్రామస్తులకు న్యాయం చేయాలన్న కమిషనర్

కృష్ణతేజ ప్రకటనపై హర్షాతిరేకాలు వ్యక్తం చేసిన గణపవరం, పసుమర్రు, మానుకొండవారి పాలెం గ్రామస్తులు.

ఎన్.ఆర్.జీ.ఎస్ బకాయిలు, గోకులం షెడ్ల నిధులు వారంలో విడుదలయ్యేలా చూస్తానన్న కృష్ణతేజ

నియోజకవర్గ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవచూపి, నిధులు అందించాలని కోరిన కృష్ణతేజను కోరిన మాజీమంత్రి ప్రత్తిపాటి









**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మే 23:**
గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో నష్టపోయిన నియోజకవర్గంలోని మూడు గ్రామాలను తిరిగి అభివృద్ధి బాట పట్టించేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటానని, ప్రభుత్వ నిధులు పథకాలు కోల్పోయిన ఆయాగ్రామస్తులకు తగిన న్యాయం చేస్తానని రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ తెలిపారు. మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి నాదెండ్ల మండలంలోని గణవపరం గ్రామంలో పర్యటించిన కృష్ణతేజ ఆ ఊరి వారితో పాటు, పసుమర్రు, మానుకొండవారిపాలెం గ్రామస్తులతో సమావేశమై వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు. నాదెండ్ల మండలంలోని గణపవరం గ్రామంలోని శాండ్ ఫిల్టర్ బెడ్లు పరిశీలించిన కృష్ణతేజ అవి అపరిశుభ్రంగా నాచుతో ఉండటంపై పంచాయతీ సిబ్బందిని ప్రశ్నించారు. నిధుల సమస్యే గ్రామంలోని అన్ని సమస్యలకు మూలమని గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది కృష్ణతేజకు తెలియచేశారు. తాగునీటి సమస్య తీవ్రత దృష్ట్యా జడ్పీ లేదా ఇతర విభాగాల నిధులతో ఫిల్టర్ బెడ్లు తక్షణమే శుభ్రపరచాలని కృష్ణతేజ సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. కొద్దిరోజుల్లోనే సమస్య పరిష్కారం కావాలని, మరలా తాను గ్రామస్తులతో మాట్లాడతానని ఆయన స్పష్టంచేశారు.

**మున్సిపాలిటీలో విలీనం వల్లే మూడుగ్రామాలకు సమస్యలు .. కృష్ణతేజకు చెప్పిన గ్రామస్తులు**

గణపవరం, మానుకొండవారిపాలెం, పసుమర్రు పంచాయతీలను గత ప్రభుత్వం ఇష్టానుసారం మున్సిపాలిటీలో విలీనం చేయడంవల్ల తమ గ్రామాలు అన్నివిధాల నష్టపోయాయని గ్రామస్తులు కృష్ణతేజకు విన్నవించారు. ఇటు పంచాయతీకి జమకావాల్సిన పన్నులు రావడంలేదని, అటు మున్సిపాలిటీ వారు తమ గ్రామాన్ని పట్టించుకోవడం లేదని ప్రజలు కృష్ణతేజకు చెప్పారు. అంతిమంగా 15వ ఆర్థిక సంఘం నిధులుకానీ, ప్రభుత్వం పల్లెలకు కేటాయించే ఇతర నిధులు కానీ దాదాపు రూ.15కోట్లవరకు నష్టపోయినట్టు గ్రామస్తులు కృష్ణతేజకు తెలియచేశారు. ఆఖరికి పంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వలేని స్థితికి తమ గ్రామాలు రావడంపై వారు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామస్తులు చెప్పింది అంతా విన్న కృష్ణతేజ ముందుగా మూడు గ్రామాల్లో పన్నుల వసూళ్లలోని సాంకేతిక సమస్యల పరిష్కారంపై వెంటనే దృష్టి పెట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. పన్నుల వసూళ్లలోని సాంకేతిక సమస్యలతో పాటు, ప్రజలకు అవసరమైన పింఛన్లు, రేషన్ కార్డులు, ఇతర పథకాల మంజూరుకు కీలకమైన ఆన్ లైన్ వ్యవస్థను సరళతరం చేయాలని, అందుకు అడ్డుగా ఉన్న సాంకేతిక ఇబ్బందులను అధిగమించాలని సమస్యల పరిష్కారంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కృష్ణతేజ సంబంధిత అధికారుల్ని ఆదేశించారు., మున్సిపల్ యంత్రాంగం కూడా ఆయాగ్రామాలను నిర్లక్ష్యం చేయడంపై కృష్ణతేజ అసహనం వ్యక్తంచేశారు. గత పాలకుల అనాలోచిత నిర్ణయాలకు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే బాధ్యతగల స్థానాల్లో ఉన్న అధికారులు చూస్తూ కూర్చోవడం ఏమిటని కృష్ణతేజ ఆగ్రహం వ్యక్తంచేశారు.

**మున్సిపాలిటీలో విలీనం వల్ల కలిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటాం**

మున్సిపాలిటీలో విలీనం సమస్యలను నెలరోజుల్లో పరిష్కారమయ్యేలా చూస్తానని, ఇన్నాళ్లలో మూడు పంచాయతీలకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటామని కృష్ణతేజ ఆయా గ్రామాలవారికి హామీ ఇచ్చారు. అవసరమైతే సమస్యని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అన్నిశాఖల యంత్రాంగాన్ని ఒకేతాటిపైకి తీసుకొచ్చి మూడుగ్రామాల వాసులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఆయా గ్రామాల్ని మున్సిపాలిటీలో విలీనం చేయడం వల్ల తలెత్తిన సమస్యల్ని స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గతంలోనే తన దృష్టికి తీసుకొచ్చారని, క్షేత్రస్థాయిలో పరిశీలించేవరకు సమస్య తీవ్రతను గ్రహించలేకపోయానని కృష్ణతేజ తెలిపారు. మూడు గ్రామాలకు ఇన్నాళ్లపాటు నిలిచిపోయిన ఎన్.ఆర్.జీ.ఎస్, గోకులం షెడ్ల నిధుల్ని వారంలో విడుదల చేయిస్తామని కృష్ణతేజ హామీఇచ్చారు. చిరుమామిళ్ల గ్రామంలో కోటిరెడ్డి అనే వ్యక్తి వైసీపీ హయాంలో నీటి వ్యాపారం సాగించి, పంచాయతీకి చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలు ఎగ్గొట్టాడని, గ్రామానికి కట్టాల్సిన పన్నులు కూడా కట్టలేదని గ్రామస్తులు కమిషనర్ కృష్ణతేజకు తెలియచేశారు. సమస్యపై స్పందించిన కృష్ణతేజ నిందితుడిపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.

**గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవచూపాలని కమిషనర్ కు ప్రత్తిపాటి విజ్ఞప్తి**

మూడు గ్రామాల సమస్య పరిష్కారంపై స్పష్టత ఇచ్చిన కృష్ణతేజను మాజీమంత్రి ప్రత్తిపాటి ప్రత్యేకంగా అభినందించారు. నియోజకవర్గంలో వెనుకబడిన గ్రామాల అభివృద్ధికి తగిన సహాయ సహకారాలు అందించాలని, ప్రత్యేక చొరవచూపాలని ప్రత్తిపాటి కమిషనర్ని కోరారు. ప్రత్తిపాటి కోరికపై కృష్ణతేజ సానుకూలంగా స్పందించారు. తాను ఈ ప్రాంత వాసినేనని ఇక్కడి ప్రజలు తాము ఎదుర్కొనే సమస్యలపై ఎప్పుడైనా తనను కలవవచ్చని ఈసందర్భంగా కృష్ణతేజ గ్రామస్తులకు తెలియచేశారు. పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ పర్యటనలో డి.పి.ఓ. నాయక్, సి.ఈ.ఓ జ్యోతి బస్, ఏ.ఈ లు, డి.ఈ లు, ఎమ్మార్వో, ఎంపీడీవో, ఇతర అధికారులు, నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మధన్ మోహన్, గంగా శ్రీనివాసరావు, హిమవంత్ రావు, జాలాది సుబ్బారావు, కెల్లంపల్లి ఆచయ్య, కందుల రమణ, గ్రామస్థులు తదితరులున్నారు.

# బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై ఉక్కుపాదం మోపుతున్న జిల్లా పోలీసులు

## 51 మందిపై కేసులు నమోదు






**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మే 23:**
జనవరి నుండి ఇప్పటి వరకు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన 2550 మంది పై కేసులు నమోదునేరాల నియంత్రణ, చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాము బహిరంగ ప్రదేశాలలో నిఘా కోసం డ్రోన్ లను సైతం వినియోగిస్తున్నాం. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిని ఉపేక్షించబోము జిల్లా ఎస్పీ తుషార్ డూడి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిని ఉపేక్షించబోమని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు గురువారం రాత్రి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసారు. వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారి వల్ల అసాంఘిక చట్ట వ్యతిరేక ఘటనలు, నేరాలు చోటుచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. మద్యం మత్తులో ఉన్న వారు ప్రజలతో అసభ్యంగా ప్రవర్తించడం, గొడవలు, దౌర్జన్యం, ఇతర పలు నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఆ సమయంలో చిన్న తగాదాలు కూడా తీవ్రమైన నేరాలుగా పరిణమించే అవకాశం ఉంటుందన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు వంటి ఘటనలకు కూడా కారణమవుతున్నారన్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లే ప్రజలకు.. పబ్లిక్ ప్రదేశాల్లో ఈ రకమైన ప్రవర్తన భయాందోళనలు కలిగించే అవకాశం ఉంటుందన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం ఒక చట్ట విరుద్ధ చర్య మాత్రమే కాదు, అది సమాజ శాంతి భద్రతలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. అందువల్ల ఇటువంటి చర్యల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. గత రాత్రి జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న 51 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. వారిని సంబంధిత న్యాయ స్థానాలలో హాజరు పరచడం జరుగుతుందని తెలిపారు. 2025 జనవరి నుండి ఇప్పడి వరకు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన 2550 మందిపై కేసులు నమోదు చెయ్యడం జరిగిందన్నారు. బహిరంగ ప్రదేశాలలో అసాంఘిక చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడి లక్ష్యంతో నిఘా కోసం డ్రోన్లను వినియోగిస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిని ఉపేక్షించబోమని, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా, ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, ఇతర అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన యడల సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారికి, (లేదా) టోల్ ఫ్రీ నెంబర్ 100/112 లకు కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# అధికారుల పనితీరు మెరుగుపరుచుకొని పెన్షన్ దారులతో మర్యాదగా వ్యవహరించాలి..!

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,మచిలీపట్నం, మే, 23**



జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారుల నుండి ప్రతికూల స్పందన వస్తుందని, పనితీరు మెరుగుపరచుకొని వారితో మర్యాదగా వ్యవహరించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ పింఛను పంపిణీ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో డి ఆర్ డి ఏ పి డి హరిహరనాథ్ తో కలిసి పింఛను పంపిణీ అధికారులతో కౌన్సిలింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ప్రతినెల అధికారులు ఐ వి ఆర్ ఎస్, 1100 కాల్ సెంటర్ ద్వారా ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాన్ని తీసుకుంటున్నారన్నారు. ప్రతి గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో కనీసం 5 మంది లబ్ధిదారుల స్పందనను తెలుసుకుంటున్నారన్నారు. జిల్లాలో గత మూడు నెలలుగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం పై పింఛన్దారులలో ప్రతికూల స్పందన వస్తోందన్నారు. అందుకు గల కారణాలు సకాలంలో పింఛను ఇస్తున్నామా లేదా నగదు మొత్తం కచ్చితంగా ఇస్తున్నామా లేదా సమయానికి ఇవ్వలేకపోతే వారికి నచ్చజెప్పి. మర్యాదపూర్వకంగా మాట్లాడుతున్నారా లేదా ప్రతి ఒక్కరూ విశ్లేషించుకోవాలన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారులు ఈ విషయమై చాలా తీవ్రంగా పరిగణిస్తూ లబ్ధిదారుల నుండి ప్రతికూల ప్రభావం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. ఇకనైనా ప్రతికూల స్పందనలు పునరావృతం కాకుండా ఇదే మొదటి, చివరి హెచ్చరికలు జారీ చేస్తున్నామన్నారు. వచ్చే నెల పింఛన్ల పంపిణీ కార్యక్రమం నుండి పనితీరు మెరుగుపరచుకొని సజావుగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో పింఛన్ల ఏపీఓ సతీష్, పలువురు పింఛన్ పంపిణీ అధికారులుగా ఉన్న గ్రామ వార్డు సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# అనంతసాగరంలో కిశోరి వికాసం



**కందుకూరు పెన్ పవర్, మే 23**

మండలం అనంతసాగరం గ్రామంలో కిశోరి వికాసం వేసవి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కౌమార బాలికలకు విద్య యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆధునిక సమాజంలో వ్యక్తిగత,సామాజిక,ఆర్థిక ఎదుగుదలకు,సాంఘిక ఆర్థిక అసమానతలను తొలగించి అభివృధి పథం వైపు అడుగులు వేయడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.ఏ కారణం చేతనూ ఏ ఒక్క విద్యార్థి బడి మానరాదని ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని వసతులు వినియోగించుకొని ప్రతి ఒక్కరూ చదువుకోవాలని వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ప్రభావతి,మహిళా సంరక్షణ కార్యదర్శి టి.అనిత, ఆశా వర్కర్,అంగన్వాడీ వర్కర్స్, వరల్డ్ విజన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నియోజకవర్గంలోని మీడియా మిత్రులకు అన్ని విధాలుగా అండగా ఉంటా

### ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య





**చీరాల,పెన్ పవర్,మే 23**

ఒంగోలులోని డీ మార్ట్ ప్రక్కన ఎమ్ఎస్ కళ్యాణమండపంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ 6వ మహాసభకు హాజరైన ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని విలేకర్లందరికి అన్ని విధాలుగా అండగా ఉంటానని అన్నారు ఈ కార్యక్రమంలో మంత్రి వర్యులు డోలా బాల వీరాంజనేయ స్వామి , ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి , గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి , దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ లక్ష్మీ , టూరిజం డెవలప్మెంట్ చైర్మన్ బాలాజీ, రియాజ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో చిలకలూరిపేట ఫోటోగ్రాఫర్ మృతి

### పెళ్ళి ఫోటోలు తీసి వస్తూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన సంజయ్

### బైక్ అదుపుతప్పి డివైడర్ ను ఢీకొన్న వాహనం, స్పాట్ లోనే సంజయ్ మృతి

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మే 23:**

సంజయ్ గత ఐదు సంవత్సరాలు నుంచి చిలకలూరిపేట పట్టణంలో ఫోటో గ్రాఫర్ గా పని చేసున్నాడు ఈ క్రమంలో నే రాత్రి పట్టణంలో ని ఓ కల్యాణమండపంలో పెళ్ళిజరుగుతుండగా, సంజయ్ పెళ్ళి ఫోటోలు పని ముగించుకొని పట్టణంలో ని స్టూడియో వద్దకు బయలుదేరాడు. సంజాయ్ నడుపుతున్న బైక్ విజయ బ్యాంక్ వద్ద కు రాగానే జాతీయ రహదారిపై అదుపుతప్పి వేగంగా డివైడర్ ను ఢీకొనడంతో సంజయ్ స్పాట్ లోనేమృతిచెందాడు. సంజయ్ సొంత గ్రామం గణపవరం, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్నీ పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# జిల్లా మహానాడు లో ఎమ్మెల్యే ఇంటూరి

## భారీగా పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు







**కందుకూరు పెన్ పవర్, మే 23:**

నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరు పార్లమెంట్ మినీ మహానాడు జరగగా రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా శాసనసభ్యులు ప్రజా ప్రతినిధులతో కలిసి కందుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గం బాగా వెనుకబడిన ప్రాంతమని, నియోజకవర్గంలో జరిగిన మినీ మహానాడులో నియోజకవర్గంలోని 7 ప్రధాన సమస్యలపై తీర్మానం ప్రవేశపెట్టడం జరిగింది. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలను అస్తవ్యస్తంగా విభజించి, కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లా నుండి నెల్లూరు జిల్లాలో కలిపి ప్రజలకు తీవ్ర అన్యాయం చేసింది. కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలపాలని ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతున్నానని ఎమ్మెల్యే తెలిపారు.రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, సోమశిల ఉత్తర కాలువ ద్వారా 1.5 టీఎంసీ నీటిని



తీసుకురావాలని ఆయన ప్రతిపాదించారు. “ఈ పనులు పూర్తయితే వందల ఎకరాల భూమి సాగులోకి వస్తుంది, అనేక గ్రామాలకు తాగునీరు అందుతుందని పేర్కొన్నారు.

పాలేరు, మన్నేరు నదులపై చెక్ డ్యామ్‌ల నిర్మాణం ద్వారా సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించవచ్చని, ఉలవపాడు మండలంలో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మ్యాంగో మార్కెట్, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అలాగే, కందుకూరు పట్టణంలో ప్రధాన ట్రాఫిక్ సమస్యను తీర్చుదానికి నార్త్ బైపాస్ రోడ్డు, ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలు రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణం, మెట్ట ప్రాంతమైన కందుకూరు నియోజకవర్గానికి వెలుగొండ ప్రాజెక్టు జలాలను తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని ఇంటూరి నాగేశ్వరరావు ప్రతిపాదించారు. ఈ ప్రధానమైన సమస్యలను పరిష్కరిస్తే కందుకూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రవేశపెట్టిన పై ప్రతిపాదనలను పార్లమెంటరీ పార్టీ జిల్లా మినీ మహానాడు వేదికగా ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది. పై తీర్మానాలను కడపలో జరిగే పార్టీ మహానాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకెళ్తామని పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర, పార్లమెంటు నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# తండ్రి చేతిలో కొడుకు హతం

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెంపెనపవర్ మే 23**



బొలెరో వాహనం విషయంలో తండ్రి కొడుకుల మధ్య జరిగిన ఘర్షణలో తండ్రి చేతిలో ఉన్న కత్తితో పొడవటంతో కుమారుడు కాశీ విశ్వనాథ రావు అలియాస్ (ఉమర్) (25) మృతి చెందిన సంఘటన యర్రగొండపాలెం పట్టణంలోని పాత పాల కేంద్ర ఎదురుగా శుక్రవారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో మార్కాపురం రోడ్డులోని పాత పాలకేంద్రం ఎదురుగా నివాసం ఉంటున్న టివి లక్ష్మినారాయణ దంపతులకు ఇద్దరు మగ సంతానం వీరిలో రెండో కుమారుడు కాశీ విశ్వనాథ రావుకు బొలెరో వాహనం ఉంది.డ్రైవర్ గా వెళుతుంటాడు.వై కొత్తపల్లిలో నివాసం ఉంటున్నాడు.బొలెరో వాహనం కుమారుడుకు తెలియకుండా తండ్రి టివి లక్ష్మి నారాయణ వాహనాన్ని తీసుకువెళ్లాడు.తనకు తెలియకుండా తన వాహనాన్ని ఎందుకు తీసుకువెల్లవు అని తండ్రిని అడిగాడు.ఈ విషయంపై ఇద్దరి మధ్య ఘర్షణ మొదలైంది.అప్పటికే మద్యం మత్తులో ఉన్న లక్ష్మినారాయణ కత్తి తీసుకొని వీరంగం సృష్టించాడు.దింతో ఆయన భార్య కలుగ చేసుకొని వరించేందుకు ప్రయత్నం చేసింది.కానీ ఆమె మీదకు కూడా దాడి చేసేందుకు ప్రయత్నం చేసాడు.ఆ సమయంలో కుమారుడు కాశీ విశ్వనాథ రావు తన తండ్రి చేతిలో ఉన్న కత్తిని తీసుకునేందుకు వెళ్లగా ఆ కత్తి కుమారుడి ఎడమ భాగంలో బలంగా కుచ్చుకోవటంతో తీవ్రంగా గాయపడ్డాడు.వెంటనే హుటాహుటిన స్థానిక ప్రభుత్వ వైద్యశాల తరలించి వైద్య చికిత్సలు అందిస్తుండగా మృతి చెందాడు.పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.మృతదేహాన్నీ పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

# సగిలి ఇంద్రసేనారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన డైరెక్టర్ ఎం వెంకట్ రెడ్డి



**అర్ధవీడు. పెన్ పవర్ , మే 23**

ప్రకాశం జిల్లా అర్ధవీడు మండల కేంద్రమైన అర్ధవీడు గ్రామ పంచాయతీ పరిధిలోనున్న నారాయణ పల్లె గ్రామానికి చెందిన సైనికుడు ఇంద్రసేనారెడ్డి గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శుక్రవారం రాష్ట్ర మాజీ సైనికుల డైరెక్టర్ ఎం వెంకటరెడ్డి, ఇంద్రసేనారెడ్డి తల్లిదండ్రులకు కలిసి పరామర్శించారు. అనంతరం ప్రభుత్వం నుంచి మంజూరైన లక్ష రూపాయల చెక్కును వారికి అందజేశారు. ముందుగా ఇంద్రసేన రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ప్రకాశం జిల్లా సైనిక్ వెల్ఫేర్ సిబ్బంది రామయ్య , అర్ధవీడు మండలం మాజీ సైనికుల అధ్యక్ష కార్యదర్శులు షేక్ డాక్టర్ మౌలాలి, షేక్ మహబూబ్ బాషా తో పాటు పలు మాజీ సైనికులు ఉన్నారు.

# శాశ్వత రూముల నిర్మాణం నిలుపుదల చేయాలి

## ఆమ్ ఆద్మీ, అఖిలపక్ష నాయకులు డిమాండ్

**కందుకూరు పెన్ పవర్,మే 23**

అంకమ్మ దేవాలయానికి ఇచ్చిన మున్సిపల్ స్థలంలో శాశ్వత కమర్షియల్ కాంప్లెక్స్ కట్టడం కోసం టెండర్ల పిలుస్తున్న సందర్భంగా అమ్ ఆద్మీ పార్టీ కందుకూరు అసెంబ్లీ కన్వీనర్ నేతి మహేశ్వర రావు, కందుకూరు అభివృద్ధి మండలి సభ్యులు తోకల వెంకటేశ్వర్లు పాలేటి కోటేశ్వరరావు అఖిలపక్ష నాయకులతో కలిసి అంకమ్మ అంకమ్మ తల్లి దేవాలయాన్ని పరిశీలించి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ గ్రామదేవతల సంస్కృతి సాంప్రదాయాలు ఆచారాలు తరతరాల నుంచి ఆ గ్రామ పూర్వీకులు భవిష్యత్ తరాలకు ఉన్న ఆస్తిపాస్తులు అని అన్నారు. గ్రామ దేవతల నిర్వహణ మిరాశిదారులకు అలాగే చాకలి మంగలి బైండ్ల యాదవ హరిజనులు పూజారులు చేయడం ఆనవాయితీగా వస్తున్న పరిస్థితి ఉంది అని అన్నారు.కందుకూరు అంకమ్మ దేవాలయం 29 దేవరలతో చుట్టుపక్కల గ్రామాలు అన్ని వర్గాలు కలిపి 45 రోజులు జరుపుకునే పెద్ద తిరునాళ్ళ అలాంటి తిరునాళ్ల సంప్రదాయం ఉన్న అంకమ్మ గుడిని దేవాలయ శాఖ పరిధికి తీసుకువచ్చినప్పటినుంచి అంకమ్మ కి చేయాల్సిన సాంప్రదాయాలు అన్ని మరుగును బడిన పరిస్థితులతో పాటు తిరునాళ్లను కూడా ఆపేసిన పరిస్థితి అని అన్నారు. ఇప్పుడు కొత్తగా అంకమ్మ గుడి నిర్వహణకు నిధులు కావాలి అని కొత్తగా కందుకూరు మున్సిపాలిటీ అమ్మవారికిచ్చిన స్థలంలో శాశ్వత కాంప్లెక్స్ పడుతున్న పరిస్థితి ని చూస్తే అమ్మవారి ఆచార వ్యవహారాలను తుంగలో తొక్కడంతో పాటు తిరుణాలను కూడా మర్చిపోయే పరిస్థితి రాబోతుంది అని అమ్మవారిని కొలిచే అన్ని వర్గాలు బాధపడుతున్న పరిస్థితులలో ఈ దేశ మూల సంస్కృతిని కాపాడడం మనందరి బాధ్యతగా భావించి రేపు జరగబోయే టెండర్ల ప్రక్రియకు నిరసన తెలియజేయవలసిందిగా కోరుతున్నాము అని అన్నారు.గ్రామ దేవతలు దేవాదాయ శాఖ పరిధిలోకి రావు కాబట్టి గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను కోర్టులో వేసి కందుకూరు అంకమ్మ గుడి ని దేవాదాయ శాఖ నుంచి విముక్తి



కల్పించడానికి హైకోర్టులో వెళ్ళబోతున్న సందర్భంగా టెండర్ల ప్రక్రియలో పాల్గొనబోయే మిత్రులు అంకమ్మ గుడి దేవాదాయ శాఖ నుంచి కందుకూరు ప్రజలకు దక్కిన నాడు మీరు కట్టిన శాశ్వత నిర్మాణాలను కూల్చివేసే పరిస్థితి ఉంటుంది కాబట్టి ఇప్పటికైనా టెండర్లలో పాల్గొనడం అన్న ప్రక్రియకు దూరంగా ఉండవలసిందిగా మనవి చేసుకుంటున్నాము అని అన్నారు. అంకమ్మ గుడి దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లిన తర్వాత అంకమ్మ గుడికి సంబంధించిన సాంప్రదాయాలు బదులు ఆలయ అధికారులు ఒక శాస్త్రీయత లేకుండా పల్లకి సేవలు అంటూ తమ పైత్యాన్ని ప్రదర్శించడం అంటే ఈ దేశ మూల సంస్కృతికి జీవనాధారమైన గ్రామ దేవతల ఆచార వ్యవహారాలను లేకుండా చేసే కుట్రగా మనందరం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది అని అన్నారు.ఇప్పటికైనా కందుకూరి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక రైతు బిడ్డగా గ్రామ దేవతల ఆచార్య వ్యవహారాలను అర్థం చేసుకుని కందుకూరు అంకమ్మ గుడిని దేవాలయ సేకరించి తప్పించడంతోపాటు అంకమ్మ తిరునాళ్లు జరగడానికి అవసరమైన మున్సిపాలిటీ ఇచ్చిన ఖాళీ స్థలాన్ని తాత్కాలిక షాపులు నిర్వహణకు చర్యలు తీసుకోవాల్సిందిగా



కోరుతున్నాను అని అన్నారు.అంకమ్మ గుడి మీద ఆధారపడిన బృందావనం కాలనీ,ఆది ఆంధ్ర కాలనీ, చాకలి, బైండ్ల వాళ్లు, కొమ్ముల వాళ్ళు, మంగలి వాళ్లు కుమ్మరి వాళ్లు, పోతురాజులు ఇలా అమ్మవారి సేవ చేసే ప్రతి వర్గం కి తాత్కాలిక్ షాపులు కేటాయించగలిగితే వీళ్ళందరూ అంకమ్మ గుడి నీ అంకమ్మ తిరునాళ్లను అంకమ్మ సాంప్రదాయాలను కాపాడే పరిస్థితి ఉంటుంది కాబట్టి అంకమ్మ గుడి నిర్వహణ కందుకూరు ప్రజలకు వచ్చేలా అలాగే అంకమ్మ గుడి కాళీ స్థలంలో గుడికి సంబంధించిన వ్యక్తులు ఆధారపడేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఇంటూరి నాగేశ్వరరావు ని కోరుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో అమ్ ఆద్మీ పార్టీ కందుకూరు నియోజకవర్గం కన్వీనర్ నేతి మహేశ్వర రావు, కందుకూరు అభివృద్ధి మండలి ఉపాధ్యక్షులు పాలేటి కోటేశ్వరరావు, అభివృద్ధి మండలి సభ్యులు తోకల వెంకటేశ్వర్లు, సిపిఐ కందుకూరు కార్యదర్శి భూసి సురేష్, సిపిఎం కందుకూరు పట్టణ అధ్యక్షులు గౌస్ బాషా, కందుకూరు నియోజకవర్గం నాయకులు సయ్యద్ సుల్తాన్ బాషా, కాంగ్రెస్ కందుకూరు నాయకులు నరేష్, తలపనేని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# 2029లో వైసీపీకి అంత్యక్రియలే

**టీడీపీలో కొనసాగుతున్న ఎన్టీఆర్ బ్రాండ్ -దేశానికే దిక్సూచిగా చంద్రబాబు నాయుడి విజన్.**

**ఏపీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమం విషయంలో తాత, తండ్రికి దీటుగా లోకేష్ బాబు.**

**మూడు తరాలతో కలిసి పనిచేసే అవకాశం నాకు లభించింది.**

**పెద్దాయన ఎన్టీఆర్ ను భారతరత్నతో గౌరవించాలి-సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.**





**వెంకటాచలం, (పెన్ పవర్) మే 23**

నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ లో నిర్వహించిన టీడీపీ జిల్లా మహానాడులో పొలిట్ బ్యూరో సభ్యులు, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ...... మహానాడు అంటేనే తెలుగుదేశం పార్టీలో నూతనోత్సాహం. ఆ రోజుల్లో హైదరాబాద్ లో నిర్వహించిన మహానాడుల్లో నాంపల్లి నుంచి నిజాం గ్రౌండ్స్ వరకు ర్యాలీగా నడిచిపోయిన రోజులు ఎప్పటికీ గుర్తుంటాయి. పెద్దాయన ఎన్టీఆర్ ఆశీస్సులతో దూబగుంట రోశమ్మ బాటలో సారా వ్యతిరేక ఉద్యమంలో రాజకీయాలకు అతీతంగా పాల్గొన్నాం..అఖిలపక్ష సారా వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ గా వ్యవహరించాను. ఉమ్మడి ఏపీలోని 22 జిల్లాలో సారా వేలం పాటలు నిర్వహిస్తే, ఒక్క నెల్లూరు జిల్లాలో మాత్రం వేలం జరగకుండా విజయవంతంగా అడ్డుకున్నాం. నెల్లూరు మహిళల పోరాట పటిమ చూసిన ఎన్టీఆర్ వీఆర్సీ మైదానం నిర్వహించిన సభ సందర్భంగా సారా నిషేదంతో పాటు సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తానని మాటిచ్చి నిలబెట్టుకున్నారు. తెలుగుదేశం పార్టీలో మొదటి నుంచి ఆ బ్రాండ్ కొనసాగుతూనే ఉంది.

విజన్, హైటెక్ సిటీ, ఐటీ, అభివృద్ధి, పరిశ్రమలు అంటేనే నారా చంద్రబాబు నాయుడు గుర్తుకొస్తారు. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఐటీ అభివృద్ధి విషయంలో చంద్రబాబు నాయుడిని ఫాలో అయ్యానని పీఎం నరేంద్రమోదీ చెప్పడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణం. ఇప్పుడు మూడో తరంలో యువ నాయకుడు నారా లోకేష్ బాబు నాయకత్వంలో పనిచేసే అవకాశం కూడా మాకు దక్కింది. ఇటీవల నెలకొన్న యుద్ధపరిస్థితుల్లోనూ నారా లోకేష్ బాబు కుటుంబానికి నరేంద్ర మోదీ రెండు గంటల పాటు ఆతిథ్యమివ్వడం గొప్ప విషయం. లోకేష్ బాబులోని నాయకత్వ లక్షణాలు, పోరాటపటిమ, అభివృద్ధి కోసం పడుతున్న తపనను మోదీ గుర్తించారు. జగన్ రెడ్డి పాలన సాగిన ఐదేళ్లలో రాష్ట్రం సర్వనాశనమైపోయింది.జూన్ 4న వెన్నుపోటు దినంగా ప్రకటిస్తామని జగన్మోహన్ రెడ్డి ప్రకటించడం హాస్యాస్పదం.2029 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైసీపీకి అంత్యక్రియలు నిర్వహించబోతున్నారు. రూ.60 కోట్ల బోఫోర్స్ కుంభకోణం, రూ.60 కోట్ల 2జీ స్కామ్ తో కాంగ్రెస్ పార్టీ నామరూపాలు కోల్పోయింది. రూ.150 కోట్ల లిక్కర్ స్కామ్ తో ఢిల్లీ సీఎం, డిప్యూటీ సీఎం, ఎంపీలు, ముఖ్య నాయకులు జైళ్లలో మగ్గిపోయారు. ఏపీలో వైసీపీ హయాంలో రూ.3200 కోట్ల మద్యం స్కామ్ జరిగిందని సిట్ పక్కా ఆధారాలతో తేల్చింది. అధికారిక విక్రయాలతో రూ.3200 కోట్ల అవినీతి జరిగితే, అనధికారికంగా జరిపిన విక్రయాల రూపంలో రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగింది. మద్యం స్కామ్ లో అడ్డంగా బుక్కయిపోయిన పరిస్థితుల్లో మన గురించి జగన్ రెడ్డి విమర్శలు చేయడం విడ్డూరం. ఉర్సా కంపెనీకి విశాఖలో 50 ఎకరాలను 90 పైసల చొప్పున ఇడ్లీ, వడ కంటే తక్కువకు ఇచ్చారని పచ్చి అబద్ధాలు చెప్పాడు. ఆ కంపెనీకి 56.30 ఎకరాలకు ఎకరా రూ.50 లక్షల చొప్పున, 3.50 ఎకరాలను ఎకరా రూ.కోటి చొప్పున కేటాయించారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక కంపెనీలకు ఉచితంగా భూకేటాయింపులు చేశారు. ఉద్యోగ, ఉపాధి, పరిశ్రమలు, పెట్టుబడులను దృష్టిలో ఉంచుకుని పారిశ్రామికవేత్తలను పిలిచి ఉచితంగా భూములిచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. రూ.కోటి, రూ.50 లక్షల చొప్పున భూములు కేటాయిస్తే సీఎంగా పనిచేసి వ్యక్తి ఇడ్లీ, వడలతో పోల్చి అసత్య ప్రచారాలు చేయడం దురదృష్టకరం. ఉర్సా కంపెనీకి ఎకరా రూ.1కి ఇచ్చివుంటే నేను సర్వేపల్లి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, జగన్ రెడ్డిని పులివెందుల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమని సవాల్ విసిరాను. ఈ రోజు దేశంలోని ఏ మద్యం కంపెనీ అయినా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే అవకాశం ఏపీలో ఉంది. గతంలో పరిస్థితి ఏంటి...వైసీపీ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడి విక్రయించిన నాసిరకమైన మందు తాగి ఎందరో ప్రాణాలు కోల్పోయారు..వేలాది మంది అనారోగ్యం పాలయ్యారు. అరాచకాలు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి వ్యక్తి ఈ రోజు గంటల తరబడి పచ్చి అబద్ధాలు చెబుతున్నాడు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా రాబోతున్నాయి. వైసీపీ హయాంలో మాదిరిగా అరాచకాలు చేయబోం. జనంలో ఉంటూ, జనం కోసం పనిచేస్తూ స్థానిక సంస్థల్లో ఘనవిజయం సాధిద్దాం. 2029 ఎన్నికల్లో తిరిగి ఘన విజయం సాధించి నారా చంద్రబాబు నాయుడిని మరో సారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదిద్దాం.పేదలకు కూడు, గూడు, గుడ్డ ఉండాలని తపించిన పెద్దాయన ఎన్టీఆర్ ను భారతరత్నతో గౌరవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు.

# పెన్ పవర్

**నెల్లూరు | తిరుపతి | చిత్తూరు**

# మినీ మహానాడులో పాల్గొన్న టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ







**కావలిపెన్ పవర్. మే 23**

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర నెల్లూరులో జరుగుతున్న మినీ మహానాడు కార్యక్రమంలో అతిరథ మహారథు లతో కలిసి పాల్గొన్నారు. సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు పార్టీ మారకుండా నిన్న నేడు నిరంతరం పార్టీ కోసం కష్టపడుతూ, కార్యకర్తల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న నాయకుడు మన్నవ రవిచంద్రఅని వారి అభిమానులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కావలి పట్టణంలో తను కరోనా కష్ట కాలంలో కావలి పట్టణ ప్రజలకు నలుమూలల కావలసిన నిత్యవసర సరుకులు అందించడం జరిగింది. అలాగే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకపోయినప్పటికీ కావలి టిడిపి మాజీ ఇంచార్జ్ ప్రస్తుత ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడుకి తోడుగా కలిసి కార్యకర్తలకి నిరంతరం తోడుగా ఉండి సహాయం చేసిన తను చేసిన మేలు మర్చిపోలేమంటూ పేద ప్రజలు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు చర్చించుకోవడం విశేషం. ఇటువంటి నాయకుని కూడా అధిష్టానం గుర్తించి, ఉన్నత పదవి ఇవ్వాలని తను చేసిన సేవలకు మంచి పదవి వస్తుందని ఆశాభ్యాము వ్యక్తం చేసిన మన్నవ అభిమానులు.

# మనందరిదీ తెలుగుదేశం కుటుంబం

**- మనందరిదీ ఒకటే కుటుంబం.. ఉమ్మడి కుటుంబం**

**- రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగలిగిన సత్తా సీఎం కే ఉంది**

**- ఎన్నో నిద్రలేని రాత్రులు గడుపుతూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళుతున్నారు**

**- ప్రతి ఒక్కరూ కలసికట్టుగా ముందుకు సాగాలి**

**- నాయకులు, కార్యకర్తలకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది.**









**బ్యూరో పెన్ పవర్, నెల్లూరు మే 23:**

తెలుగుదేశం పార్టీ ఉమ్మడి కుటుంబం అని, ప్రతి ఒక్కరు కలిసికట్టుగా ముందుకు సాగుతూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరు కనుపర్తిపాడు లోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరిగిన నెల్లూరు పార్లమెంటు మహానాడు సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారీగా తరలివచ్చిన కార్యకర్తలు నాయకులు అభిమానులతో విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ కిటకిటలాడింది. పసుపు జెండా రెపరెపలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలుపార్టీ నాయకులు, కార్యకర్తలతో మహానాడు ప్రాంగణం జాతరను తలపించింది. ముందుగా పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, మంత్రి పొంగూరు నారాయణ, మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని పెంచిన గొప్ప వ్యక్తి ఎన్టీ రామారావు అని, ప్రపంచంలోనే తెలుగు వారికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు కి దక్కుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కష్టకాలంలో చాలా ఇబ్బందులు పడ్డారని, అలాంటి వారికి ఎంపీగా తప్పకుండా అండగా నిలబడతానన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త పాత నాయకుల కలయికతో పార్టీ ముందుకు సాగాలన్నారు. ఒక్క క్షణం తీరిక లేకుండా కష్టపడి పని చేసే ప్రతి సీఎం చంద్రబాబు నాయుడు అని అన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ అటు కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తున్నారన్నారు. త్వరలోనే తల్లికి వందనం అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలు చేయనున్నారని చెప్పారు. గుంటలరహిత రాష్ట్రగా తీర్చిదిద్దారన్నారు. భవిష్యత్తులో నారా లోకేష్ నాయకత్వంలో పార్టీ మరింత ముందుకు సాగుతుందని వెల్లడించారు.

# అత్యాధునిక వసతులతో విఆర్ పాఠశాల

**- మంత్రి నారాయణ చాలా గొప్ప పనిచేస్తున్నారు**

**- నిరుపేద విద్యార్థులకు ఎంతో ఉపయోగం**

**- ప్లేగ్రౌండ్‌తో అద్భుతంగా తయారు చేస్తున్నారు**

**- మంత్రి నారాయణతో కలిసి విఆర్ పాఠశాలను పరిశీలించిన ఎంపీ వేమిరెడ్డి**









**బ్యూరో పెన్ పవర్, నెల్లూరు మే 23:**

నిరుపేద విద్యార్థులకు అత్యాధునిక వసతులతో కూడిన విద్య అందుబాటులోకి రానుందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తో కలిసి నెల్లూరు నగరంలోని విఆర్ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ నందన్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు. విఆర్ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న వసతులపై ఎంపీ వేమిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గతం కంటే భిన్నంగా అత్యాధునిక వసతులు కల్పిస్తున్నారని ప్రశంసించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... పేద పిల్లల కోసం చేపట్టిన ఈ కార్యక్రమం చాలా గొప్పదని శిథిలావస్థలో ఉన్న విఆర్ హైస్కూల్ రూపురేఖలే మారిపోయాయన్నారు. ప్లేగ్రౌండ్ అద్భుతంగా తయారు చేస్తున్నారని, తల్లిదండ్రులు పనులు ముగించుకొని వచ్చేవరకు పిల్లలు ఆడుకునేందుకు ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఉచిత భోజనం, స్నాక్స్, ట్రాన్స్పోర్ట్ సౌకర్యం కల్పించడం సంతోషకరమని, పాఠశాల నిర్వహణను నారాయణ కుమార్తె షరణి బాధ్యత తీసుకోవడం గొప్ప విషయం అన్నారు. హైదరాబాదులోని ది బెస్ట్ స్కూలుకు దీటుగా విఆర్ పాఠశాల సిద్ధమవుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా నారాయణ కి, ఆయన కుమార్తె షరణీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పరిశీలనలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మామిడాల మధు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా మహానాడులో పాల్గొన్న మన్నవ





**కావలి పెన్ పవర్, మే 23:**

సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులుగా, ఎన్టీఆర్ గారి అభిమానిగా, పార్టీ మారకుండా నిన్న నేడు నిరంతరం పార్టీ కోసం కష్టపడుతూ, కార్యకర్తల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న నాయకుడు మన్నవ రవిచంద్ర శుక్రవారం జిల్లా మహానాడులో పాల్గొన్నారు. 2019 తర్వాత కావలిలో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అకృత్యాల కారణంగా స్థానిక నేతలు, కార్యకర్తలు బయటకు రావడానికే భయపడుతున్న పరిస్థితుల్లో, ఆయన ఒక్కరే వెనకడుగు వేయకుండా ధైర్యంగా ముందుకు వచ్చి కార్యకర్తల్లో నమ్మకాన్ని, ధైర్యాన్ని నూరిపోసారు. అంతేకాకుండా, కరోనా కష్టకాలంలో కావలి పట్టణ ప్రజలకు అత్యవసర సరుకులు అందించి ప్రజల అభిమానం పొందారు. అలాగే, నాడు తెలుగుదేశం పార్టీ అధికారంలో లేకపోయినా, మాజీ ఇంచార్జ్ మాలేపాటి సుబ్బానాయుడుకి అండగా నిలిచి, కార్యకర్తలకు సహాయంగా ఉన్నారు. ఆయన చేసిన సహాయాన్ని కార్యకర్తలు, పేద ప్రజలు ఎప్పటికీ మరచిపోలేమని ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇలాంటి అంకితభావం కలిగిన నాయకుడిని అధిష్టానం గుర్తించి, తగిన స్థానం కల్పించాలని, ఆయనకు ఉన్నత పదవి రావాలని మన్నవ రవిచంద్ర అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# ఘనంగా వైసిపి నేత రేగం చాణిక్య జన్మదిన వేడుక

**వైసిపి జిల్లా జెఎసిఎస్ కో ఆర్డినేటర్ అరబీరు జగబంధు.**

**వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పాంగి పద్మారావు**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 23.**రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగనన్న సైనికుడు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సమన్వయం చేసి పార్టీకి కృషి చేసే యువ నాయకుడు అరకు నియోజకవర్గం స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కుమారుడు, వైసీపీ యువనేత రేగం చాణిక్య జన్మదిన వేడుకలు మండలంలో గల పార్టీ క్యాంపు కార్యాలయంలో అల్లూరి జిల్లా జేసిఎస్ జిల్లా కో ఆర్డినేటర్ జగబంధు, మండల పార్టీ అధ్యక్షులు పాంగి పద్మారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అరకు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపుకు అహర్నిశలు కృషిచేసి పార్టీ కార్యకర్తలకు నాయకులకు అభిమానులకు సమన్వయంతో పనిచేసి ఎన్నికల నిర్వహణలో ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టి అరకు నియోజకవర్గంలో గొప్ప మెజార్టీ విజయానికి కారకులైన రేగం చాణిక్యకు హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి సర్పంచ్ దొర నీలకంఠం, వార్డు సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, సోషల్ మీడియా కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశాఖ సెంట్రల్ జైలుకు చేరుకున్న విజయనగరం పోలీసులు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం మే 23:**సెంట్రల్ జైల్లో ఉన్న ఉగ్రదాడులకు ప్లాన్ చేసిన సిరాజ్, సమీర్లను విజయనగరం తీసుకెళ్లడానికి సెంట్రల్ జైలుకు చేరుకున్న పోలీసులు. సిరాజ్ సమీర్ లను ఏడు రోజుల పోలీస్ కస్టడీకి ఇచ్చిన విజయనగరం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్. నిన్న రాత్రి 10:30 నిమిషాలకు విజయనగరం పోలీసులకు సిరాజ్,సమీర్ల పోలీస్ కస్టడీ అనుమతులు పేపర్స్ అందడంతో ఉదయాన్నే సెంట్రల్ జైలుకు చేరుకున్న విజయనగరం పోలీసులు రెండు వాహనాల్లో విశాఖ సెంట్రల్ జైలుకు వచ్చిన విజయనగరం పోలీసులు సిరాజ్ సమీర్లను సెంట్రల్ జైలు నుండి పోలీసులు కస్టడీకి తీసుకున్న వెళ్లిన విచారణ చేపట్టిన ఎన్ఐఏ

# నవధాన్యాల సాగు వలన అధిక దిగుబడి.



**గుమ్మలక్షీపురం.మే 23 పెన్ పవర్.**
పి.ఆమిటి గ్రామంలో శుక్రవారం నాడు 18 రకాల పి.ఎం.డి.ఎస్.విత్తనాలు ఆర్.వై.ఎస్ సంస్థ.క్లస్టర్ ఎల్ వన్. పువ్వల ప్రసాదు. మరియు వి.ఏ.ఏ.అలాగే సర్పంచ్.దమయాంతి ఆధ్వర్యంలో తయారు చేసి రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా.పి. ప్రసాదు మాట్లాడుతు.పీ.ఎం.డి.ఎస్ వితనాలు భూమికి జీవం లాంటివి. ఎందుకంటే. ఈ అన్నిరకాల వితనాలు ఇపుడు పొలం లో జెల్లుకొంటె అవి మొలకెతిన్న తరువాత వాటిని నాగలితో దునుకోవడం వలన భూమి శారవంతం అవుతుంది.అలాగే వానపాము చేరి భూమిని గుల్ల చేస్తుంది దానివలన మొక్కఎదుగుదల మరియు పంట మంచి దిగుబడిని ఇస్తు. నాణ్యత పెరుగుతుంని. కావున ఈ విత్తనాలు.రైతులు తమపొలాలోతప్పనిసరిగా వేసుకోవాలని ప్రసాదు రైతులకు విరించారు. అలాగే ఈ సందర్భంగా సర్పంచ్.దమయంతి మాట్లాడుతూ ప్రకృతి వ్యావసాయం అనేది దేవుడు ఇచ్చిన వరం. మనం దానిని ఎప్పటికి మరువకూడదు.పీఎండీఎస్ విత్తనాలు వేయడంవలన పొలానికి మంచి బాలని ఇచ్చి రైతులు ఆశించే విధంగా పంటదిగుబడి వస్తుందని ఆమె అన్నారు. అలాగే ఈ కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయసిబ్బంది. మరియు రైతులు పాలుగోన్నారుద

# బాలికలు అభివృద్ధి చెందేలా కిశోరి వికాసం



**సీతానగరం, పెన్ పవర్, మే23:**బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం 'కిశోరి వికాసం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించిందని సీతానగరం మండలంలోని ముగ్గళ్ళ అంగన్వాడీ టూలో సూపర్వైజర్ పీ. వరలక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్య, ఆరోగ్యం, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత వంటి అంశాలపై బాలికలకు అవగాహన కల్పించనున్నారని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని,ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సొంతం చేసుకొనేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూతనివ్వనున్నట్టు వివరించారు. ఇందుకు ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకొనేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. బాలికల్లో ఆత్మరక్షణ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం, డిజిటల్ భద్రత, సైబర్క్రైమ్, ఆన్లైన్ వేదికలపై జాగ్రత్తగా వుండేలా అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. బాలికలు అన్ని విధాలా ఎదగడానికి ఉన్న అడ్డంకులను తొలగించడంలో పటిష్ట భాగస్వామ్యం ఉండాలన్నారు. డ్రాపౌట్స్ తిరిగి చదువుకొనేలా ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్య, ఉపాధి అవకాశాలు పెంచడం, రక్తహీనతను నివారించడం, బాల్య వివాహాలను అడ్డుకోవడం, యోగా, శారీరక వ్యాయామాన్ని ప్రోత్సహించడం తదితరాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశ మరియమ్మ. పోషణ సాహితి మంజు. డ్వాక్రా వివో ఏ రూప, అంగన్వాడీ హెల్పర్స్ చిన్నారి, సూరబిబి ధనలక్ష్మి, దేవి, తదితరులు పాల్గొన్నారు ,

# జిల్లాలోని మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ లు నిబంధనలకు అనుగుణంగా నడపాలి

**– ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారిణి లావణ్య**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్ మే 23:**తూర్పు గోదావరి జిల్లా లోని మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ లు నిబంధనలకు అనుగుణంగా పనిచేసే విధంగా చూడడానికి ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో నైట్ పెట్రోలింగ్ నిర్వాహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని ఎక్సైజ్ స్టేషన్ లలో ఇన్స్పెక్టర్, సిబ్బంది వారి పరిధిలో ఉన్న షాపులు, బార్లు అన్ని నిబంధనలు పాటించే విధంగా రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహిస్తారని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి సీహెచ్.లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలియచేసారు. ఇందులో భాగంగా సమయపాలన, విడి విక్రయాలు, ఎమ్మార్పీకి మించి అమ్మకాలు లేకుండా చూడటం, అనధికార సిట్టింగ్లను నివారించడం, షాపు పరిసరాలన్నీ శుభ్రంగా ఉంచడం, షాపు నందు రికార్డులు సమర్థవంతంగా నిర్వహించడం, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించటం వంటి ప్రధానమైన నిబంధనలు ఖచ్చితంగా అమలు అయ్యేందుకు చర్యలు, పర్యావరణ చెయ్యడం జరుగుతుందని వెల్లడించారు. ఇందుకుగాను ప్రతి కానిస్టేబుల్ కు మూడు లేదా నాలుగు షాపుల బాధ్యతను అప్పగించడం అయినదని అన్నారు. సబ్ ఇన్స్పెక్టర్, ఇన్స్పెక్టర్స్, సహాయ ఎక్సైజ్ పర్యవేక్షకులు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారని తెలియ చేశారు. మరింత పకడ్బందీగా నిర్వహించేందుకుగాను ఎక్సైజ్ "ఐ" అనే మొబైల్ అప్లికేషన్ కూడా త్వరలో ఎక్సైజ్ శాఖ తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ యాప్ ద్వారా మద్యం షాపు, బార్లలో జరిగే అన్ని కార్యకలాపాలను నేరుగా పర్యవేక్షణ చెయ్యడం, ఈ నైట్ పెట్రోలింగ్ కార్యక్రమాన్ని ఉన్నతాధికారులైె నటువంటి ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ కమీషనర్, డిప్యూటీ కమీషనర్లు కూడా ప్రత్యక్షంగా పాల్గొని సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. మీ పరిసర ప్రాంతాల్లో ఎక్సైజ్ నేరాలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే మా టోల్ ఫ్రీ నెంబరు 14405 కి కాల్ చేసి తెలియజేయవచ్చు అని విజ్ఞప్తి చేశారు. మద్యం షాపు లలో ఎటువంటి లైసెన్స్ నిబంధనలు ఉల్లంఘించినా, అటువంటి వారిపై చర్యలు తప్పవు అని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హెచ్చరించారు.

# చింతపల్లి మండలంలో బీసీ మహిళలకు కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభం

- తెదేపా జిల్లా ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి





**చింతపల్లి పెన్ పవర్ మే 23:** మహిళల ఆర్థిక, సామజిక జిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలుగుదేశం పార్టీ జిల్లా ఇన్చార్జి, పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి అన్నారు. గురువారం చింతపల్లి మండలంలోని సచివాలయంలో ఎంపీడీవో యూ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళల ఆర్థిక స్వాలంబనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందనీ, మహిళల కోసం పలు పథకాలు, శిక్షణా కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం, సమాజం ముందుకు సాగుతుందని చెప్పారు. ప్రత్యేకించి గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ శిక్షణ శిబిరం కూడా ఆ దిశగా ఒక మంచి ముందడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ శిక్షణ శిబిరంలో ప్రతీరోజు 25 మంది చొప్పున రెండు బ్యాచిలుగా విభజించి, ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు మరో బ్యాచ్కు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియ పుష్పలత, ఎంపీపీ కోరాబు అనూష దేవి, ఎంపీటీసీ జయలక్ష్మి, తెదేపా నాయకుడు పెద్దిరెడ్ల బేతాళుడు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జగ్గంపేటలో అన్న క్యాంటీన్ కు శంకుస్థాపన



**జగ్గంపేట, పెన్ పవర్, మే 23:** స్థానిక గోకవరం రోడ్డులోని పంచాయతీరాజ్ అతిథి గృహం వద్ద ప్రభుత్వం ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ రూ.61 లక్షల అంచనా వ్యయంతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ హాజరై కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం జ్యోతుల నవీన్ మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరుపేదల కడుపు నింపిన అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం మూసివేసింది. ఈ పథకం నిలుపుదల ద్వారా వేలాదిమంది నిరుపేదలు, కార్మికులు, కర్షకుల కడుపుకొట్టింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ చేయడం జరిగిందని అన్నారు. నియోజకవర్గ కేంద్రం ఏజెన్సీ ముఖద్వారం జగ్గంపేటలో కూడలి ప్రాంతంలో నిత్యం ప్రజలు వివిధ ప్రాంతాల నుంచి వస్తూ ఉంటారని వైద్యం కోసం, వారపు సంతల కోసం వస్తూ చేతిలో డబ్బులు లేకపోవడం, ఇంటి వద్ద క్యారేజీ సమకూర్చలేని పరిస్థితుల్లో ఉన్నవారికి గతంలో టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్ల ద్వారా అతి స్వల్ప ధరకే ఆహారం ఈ అన్న క్యాంటీన్ ఉపయోగపడుతుందని ఉద్దేశంతో నూతన క్యాంటీన్ భవనాన్ని నిర్మించడానికి ఈరోజు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అక్షయపాత్ర ఆధ్వర్యంలో సరఫరా చేసిన ఆహారాన్ని రూ.5కే ఉదయం అల్పాహారం, రూ.5కే మధ్యాహ్నం లంచ్, రాత్రిపూట రూ.5కే డిన్నర్ ద్వారా పేదలకు ఆహా రం అందిస్తుందని నవీన్ అన్నారు. గత మూడున్నర సంవత్సరాలుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రతి సోమవారం ఉచిత అన్న కాంటీన్ నిర్వహిస్తున్నామని నవీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, మంగ రౌతు రామకృష్ణ, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, పురం శెట్టి శివాజీ, పబ్లిక్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ డి ఈ ఈ గంగరాజు, ఏ ఈ సురేంద్ర, బచ్చుల సుధీర్, దాపర్తి సీతారామయ్య, ఎమ్మార్వో రమేష్, ఎంపీడీవో చంద్రశేఖర్, బద్ది సురేష్, మారిశెట్టి రాధా, ఆశీర్వాద్ రియల్ ఎస్టేట్ రాజు, కోడూరి రమేష్, ఎండి కాజా, పంచాయతీరాజ్ డి ఈ ఉమాశంకర్, జేఈ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఊబలంక,కట్టుంగ గ్రామాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం ఎమ్మెల్యే సత్యానందరావు.



**ఆత్రేయపురం పెన్ పవర్ మే 23:**రావులపాలెం మండలం ఊబలంక గ్రామంలో ఆత్రేయపురం మండలం కట్టుంగ గ్రామంలో గోదావరి డెల్టా కాలువపై అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు .గన్నవరం కెనాల్ పై కట్టుంగ వద్ద 10 లక్షల రూపాయలతో పునర్మించనున్న అంకంపాలెం డీపీ ఇన్లెట్ కు శంకుస్థాపన చేశారు.ఉబలంక గ్రామం వద్ద డెల్టా కెనాల్ వద్ద పునర్మించనున్న కల్వర్ట్ నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యానందరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డెల్టా వైస్ చైర్మన్ కరుటూరు నరసింహారావు, తెలుగుదేశం నాయకులు నాథ, హరిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు

# జిల్లా ఎస్పీ ను కలిసిన జనసేన ఇన్చార్జ

**జగ్గంపేట, పెన్ పవర్, మే 23:** కాకినాడ జిల్లా బిందుమాధవ్ ను శుక్రవారం జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకు రమేష్ పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నియోజకవర్గంలోని పలు శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై ఎస్పీతో చర్చించారు.



# టీడీపికి దూరంగా టాలీవుడ్

**ఏలూరు, మే 23, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. రెండు సార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ, రెండు సార్లు విభజిత ఏపీలోనూ ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించారు. చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చి దాదాపు యాభై ఏళ్లు అవుతున్నప్పటికీ ఆయన కు తొలి నుంచిటాలీవుడ్ తో మంచి సంబంధాలున్నాయి. అసలు ఆ మాటకొస్తే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు టాలీవుడ్ లో అగ్రస్థానంలో కొన్ని దశాబ్దాల పాటు వెలిగి చివరకు పార్టీ ని పెట్టి రాజకీయాల్లోకి వచ్చారు. దీంతో తెలుగుదేశం పార్టీకి, టాలీవుడ్ కు మధ్య సంబంధాలు దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్టీఆర్ హయాం నుంచి ప్రారంభమైన ఈ సంప్రదాయాన్ని చంద్రబాబు కూడా కొనసాగించారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా టాలీవుడ్ కు చెందిన వారిలో ఎవరో ఒకరు రాజ్యసభ లేదా పార్లమెంటు సభ్యులుగానో ఉండేవారు. ఎన్నికల ప్రచారంలోనూ టాలీవుడ్ నుంచి ఆయనకు సహకారం అందేది. చంద్రబాబు అంటే టాలీవుడ్ కు ప్రత్యేక అభిమానం ఉంది. అదే ఆయనను టాలీవుడ్ కు దగ్గర చేసింది. ఎన్నికల ప్రచారంలో దశాబ్దాల క్రితం సినిమాల్లో యాడ్స్ తో పాటు పాటలు వంటివి కూడా టాలీవుడ్ నుంచి వచ్చేవి. దర్శకులు, నిర్మాతలు, నటులు ఇలా 24 ఫ్రేమ్స్ నుంచి ఆయనకు వెన్నంటే ఉండేవారు. అలాగే ఆయన ఎప్పుడు అధికారంలోకి వచ్చినా టాలీవుడ్ నుంచి వచ్చి అందరూ కలిసేవారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కలసి అభినందనలుచెప్పి వెళ్లేవారు.. అంతేకాదు చంద్రబాబు కూడా వివిధ నామినేటెడ్ పోస్టుల్లో టాలీవుడ్ కుచెందిన వారిని నియమించేవారు. 2014 లో అధికారంలోకి వచ్చినప్పుడు కూడా ఎస్వీబీసీ ఛానల్ కు ఛైర్మన్ గా దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావును నియమించేవారు. నాడు మురళీ మోహన్ ఎంపీగా ఉండటంతో ఆయన అంతా తానే అయి టాలీవుడ్ ను చంద్రబాబు చెంతకు చేర్చేవారు. అలాగే రాజేంద్ర ప్రసాద్ వంటి నటులు కూడా వచ్చి చంద్రబాబును కలసి తమ సమస్యలను విన్నవించుకునే వారు. అలాంటిది కూటమి ప్రభుత్వం 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం టాలీవుడ్ నుంచి చంద్రబాబు వద్దకు వచ్చిన వారు తక్కువేననిచెప్పాలి. హైదరాబాద్ కు వచ్చినప్పుడు కలవడమే తప్ప ప్రత్యేకంగా అమరావతికి వచ్చి కలిసిన వారు ఎవరూ లేరు. దీనికి ప్రధాన కారణం జనసేన అధినేత పవన్ కల్యాణ్. టాలీవుడ్ ను శాసిస్తున్న మెగా కుటుంబానికి చెందిన పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా ఉండటం, సినిమాటోగ్రఫీ మంత్రిగా జనసేన ఎమ్మెల్యే కందుల దుర్గేశ్ కూడా ఉండటంతో చంద్రబాబు ఇక తనంతట తానే టాలీవుడ్ కు దూరమయినట్లు అంటున్నారు. పవన్ కల్యాణ్ అంటేనే టాలీవుడ్ కు చెందిన వారు కలుస్తారు.

ఆయనకు సీనీరంగంలో ఉన్న పరిచయాలతో ఆ పరిశ్రమలో ఉన్న సమస్యలు కూడా తెలుసు. అందుకే ఆ విషయాల్లో తాను జోక్యం చేసుకోవడం అనవసరమని భావించి చంద్రబాబు టాలీవుడ్ కు దూరంగా ఉంటున్నారని తెలిసింది. ఏ నిర్ణయం తీసుకున్నా పవన్ కల్యాణ్ హర్ట్ అవుతారేమోనని భావించి చంద్రబాబు తెలుగు చలన చిత్ర పరిశ్రమ గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. నిజంగా నలభై ఏళ్ల తర్వాత చంద్రబాబు టాలీవుడ్ కు దూరమయ్యారా? అన్న టాక్ మాత్రం చిత్ర పరిశ్రమలో బలంగా వినిపిస్తుంది.


# కరోనా ఆంక్షలు...

**విజయవాడ, మే 23, పెన్ పవర్:**దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. దక్షిణాది రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఏపీలో కోవిడ్ నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యలపై మార్గదర్శకాలను వైద్య ఆరోగ్య శాఖ జారీ చేసింది. కోవిడ్ కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దక్షిణాది రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు నమోదు అవుతుండటంతో ముందస్తు చర్యలు చేపట్టింది.దేశంలో మళ్లీ కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఆరోగ్య శాఖ ప్రజలకు పలు సూచనలు జారీ చేసింది. ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రార్థన సమావేశాలు, సామాజిక సమావేశాలు, పార్టీలు, బహిరంగ కార్యక్రమాలు వంటి అన్ని సామూహిక సమావేశాలను తక్షణం నిలిపి వేయాలని పేర్కొన్నారు.

రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్‌లు, విమానాశ్రయాలలో అన్ని %జూం×ణ%-19 ప్రవర్తన నియమావళి పాటించాలని స్పష్టం చేశారు. వృద్ధులు (60 ఏళ్లు పైబడిన వారు) గర్భిణీ స్త్రీలను ఖచ్చితంగా ఇంటి లోపలే ఉండాలని సూచించారు.

మంచి పరిశుభ్రతను పాటించాలని-క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం, దగ్గు/తుమ్ములు వచ్చినప్పుడు నోటిని కప్పి, పదేపదే ముఖాన్ని తాకడం వంటి పనులు చేయొద్దని సూచించారు. ప్రమాదకర ప్రాంతాలలో మాస్కలు ధరించాలని, రద్దీ ప్రదేశాలు, తక్కువ గాలి ప్రసరణ ఉన్న ప్రదేశంలో ఉంటే, మాస్క్ ధరించడం ద్వారా వైరస్ వ్యాప్తిని తగ్గించడంలో సహాయ పడుతుందని సూచించారు. కోవిడ్ సంబంధిత లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షించుకోవాలని-COVID-19 కేసులను ముందుగానే గుర్తించడంలో నిర్ధారణ పరీక్ష



కీలకంగా ఉంటుందన్నారు. కోవిడ్ ప్రభావిత దేశాలకు ప్రయాణించిన వ్యక్తికి పరీక్షలు చేయించుకోవాలని, సాధారణ లక్షణాలలో లక్షణాలు వ్యక్తిని బట్టి మారుతూ ఉంటాయని తేలికపాటి నుండి మితమైన లక్షణాలలో జ్వరం, చలి, దగ్గు, అలసట, గొంతు నొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారటం లేదా ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు లేదా విరేచనాలు ఉంటాయి. ఇలాంటి లక్షణాలు గమనించినట్లయితే నిర్ధారణ మరియు చికిత్స కోసం సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు.

అనారోగ్యంగా ఉంటే ఇంట్లోనే ఉండాలని ఇతరులను సంప్రదించకుండా ఉండటం ద్వారా ఇతరులను కోవిడ్ బారిన పడకుండా కాపాడొచ్చని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

ఆరోగ్య శాఖ ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలతో 24/7 ల్యాబ్‌లతో మాస్క్, కిట్, ట్రిపుల్ లేయర్ మాస్కలను తగినంత పరిమాణంలో ఉంచుకోవాలని సూచించారు.

# డీఎస్సీలో ఒక్కో పోస్టుకు 25 మంది పోటీ

**విజయవాడ, మే 23, పెన్ పవర్:**డీఎస్సీ పరీక్షా కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు జరుగుతోంది. గడువుకంటే ముందే పరీక్షలు పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రోజుకి 40 నుంచి 50 వేల మందికి రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ఐయాన్ కేంద్రాలు ఎంపిక పూర్తయ్యింది.మెగా డీఎస్సీ-2025 పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మే 15వ తేదీతో ఆన్‌లైన్ అప్లికేషన్ల నమోదు గడువు పూర్తయిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మొత్తం ఎంత మంది అభ్యర్థులు పరీక్షలు రాయబోతున్నారన్న డేటా అధికారుల వద్ద ఉంది. దీంతో పరీక్ష కేంద్రాల ఎంపికపై దృష్టి సారించారు. రోజుకి సరాసరి 40 నుంచి 50 వేల మందికి ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. ఆ మేరకు కేంద్రాలను ఎంపిక చేస్తున్నారు.అధికారిక సమాచారం మేరకు.. ఇప్పటి వరకు అన్ని రకాల పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తున్న టీసీఎస్ అయాన్ వారితో అధికారులు సంప్రదింపులు జరిపారు. జూన్ 6 తేదీ నుంచి జరగనున్న డీఎస్సీ పరీక్షలకు తమ కేంద్రాలను ఇచ్చేందుకు ఈ సంస్థ అంగీకరించింది. ఈ కేంద్రాలతోపాటు.. రాష్ట్రంలోని ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కళాశాలల్లో కూడా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వారితోకూడా సంప్రదింపులు జరిపారని తెలిసింది.డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి ఎలాంటి డీవియేషన్స్, షెడ్యూల్ మార్పులు లేకుండా.. అధికారులు ముందుకెళ్తున్నారు. వారి స్పీడ్ చూస్తుంటే.. పరీక్షల కోసం ఇచ్చిన 30 రోజుల షెడ్యూల్ కంటే ముందే పూర్తిచేసేలా ఉన్నారు. ఇప్పటికే టీసీఎస్ అయాన్ కేంద్రాలు ఎంపిక చేయగా.. వాటి సామర్థ్యం రోజుకి సరాసరి 20 వేల మందికి రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించగలరు. వీటితోపాటు ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులోకి వస్తే.. మరో 20 నుంచి 30 వేల మందికి ఒకేరోజు పరీక్షలు జరిపే వెసులుబాటు ఉంటుంది. ఈ లెక్కన రోజుకి 40 వేల మంది చొప్పున చూసుకున్నా.. గరిష్టంగా 20 రోజులు కూడా పరీక్షల నిర్వహణకు ఎక్కువే అని అధికారులు చెబుతున్నారు.ఎస్సీ వర్గీకరణ ఈ డీఎస్సీ నోటిఫికేషన్ నుంచే అమలు చేస్తున్నారు. ఆ మేరకు పోస్టులను ప్రకటించగా.. ఎంత మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు అన్నది కూడా అధికారులు తెలియజేశారు. ఎస్సీ జీఆర్ 1, జీఆర్ 2, జీఆర్ 3 కింద మూడు కేటగిరీల్లో వరుసగా.. 1,848, 45,419, 61,905 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేశారు. మొత్తం 16,347 ఉద్యోగాలకు 3,35,401 మంది అభ్యర్థులు వివిధ పోస్టులకు కలిపి 5,77,417 దరఖాస్తులను నమోదు చేశారు.ఒక్కో పోస్టుకు సరాసరి 35 మంది పోటీ పడనున్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్ల నమోదులో

మహిళలు ముందంజలో ఉన్నారు. దాదాపు 2,03,647 మంది మహిళా అభ్యర్థులు, 1,31,754 మంది పురుషుల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు ఎస్సీఆర్టీ డైరెక్టర్, డీఎస్సీ కన్వీనర్ కృష్ణారెడ్డి వెల్లడించారు. ఈ నెల 30వ తేదీ నాటికి హాల్‌టికెట్లు విడుదల చేస్తామని ఆయన చెప్పారు.

డీఎస్సీ పోస్టులు అధికంగా ఉన్న కర్నూలు జిల్లాలకు సంబంధించి అభ్యర్థుల నుంచి భారీగా దరఖాస్తులు నమోదయ్యాయి. మొత్తం 2678 పోస్టులు ఉండగా.. 39,997 మంది అభ్యర్థుల నుంచి మొత్తం 73,605 అప్లికేషన్లు వచ్చాయి. నెల్లూరు జిల్లాలో మొత్తం పోస్టులు 673 ఉండగా... 15,993 మంది అభ్యర్థుల నుంచి 28,772 అప్లికేషన్లు వచ్చాయి. ఇక్కడే అత్యల్పంగా దరఖాస్తులు వచ్చాయి. ఇతర రాష్ట్రాల నుంచి 7,159 మంది అభ్యర్థుల నుంచి 10,143 అప్లికేషన్లు వచ్చాయి.

## వినూత్న కార్యక్రమాలతో పవన్

**గుంటూరు, మే 23, పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జనంలోకి వెళ్లాలంటే కొంత ఇబ్బందులు తప్పవు. ఆయన ఇతర రాజకీయ నేతలు తరహా కాదు. సినీ హీరో కావడంతో పాటు లక్షలాది మంది అభిమానులు ఉండటంతో పవన్ కల్యాణ్ అంత సులువుగా జనంలోకి వెళ్లలేరు. ఏదైనా బహిరంగ సభలు, రోడ్ షోలకు మాత్రమే పరిమితమవుతారు. పాదయాత్ర వంటివి చేయాలన్నా ఆయనకు భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి. వాహనంపై ఉన్నప్పటికీ అభిమానులు పోలీసు వలయాన్ని ఛేదించుకుని మరీ వచ్చి రచ్చ చేయడం అనేకసార్లు చూశాం. అభిమానుల తాకిడిని తట్టుకోవడం కూడా పవన్ కల్యాణ్ కు కష్టంగా మారి జనంలోకి రావడం అంటే పవన్ భయపడిపోతున్నారు. పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి కార్యక్రమాలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను ప్రత్యేకంగా వినియోగించుకోవడమే కాకుండా, తనకున్న పలుకుబడితో నిధులు తీసుకు రావడంతో గ్రామీణ రహదారులు మాత్రమే కాకుండా గిరిజన ప్రాంతాల్లో దశాబ్దాల నుంచి రోడ్డు సౌకర్యం లేక అల్లాడుతున్న ఏజెన్సీ ఏరియాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టారు. స్వయంగా గిరిజన ప్రాంతాలను దర్శించి వారితో చర్చించి సమస్యలను అడిగి తెలుసుకుని మరీ పరిష్కారం చేసే దిశగా పవన్ కల్యాణ్ అడగులు వేస్తున్నారు. ఒక్క గిరిజన ప్రాంతాలకు మాత్రమే నేరుగా పవన్ కల్యాణ్ జనంలోకి వెళుతున్నారు. పంచాయతీలకు నిధులు మంజూరు చేయించి పల్లె పండగ పేరుతో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పంచాయతీ పరిథిలో ఉన్న సమస్యలను సర్పంచ్ తో పాటు గ్రామ కమిటీలు కూర్చుని పరిష్కరించుకునేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పంచాయతీలకు ప్రభుత్వం చేత నిధులు విడుదల చేయించి విద్యుత్తు బకాయిలతో పాటు, రహదారులు, మంచినీటి సౌకర్యం వంటివి కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడింది. గత వైసీపీ పాలనలో పంచాయతీలను నిర్వీర్యం చేయడంతో సర్పంచ్ లు అప్పుల పాలయ్యారు. దీంతో పవన్ కల్యాణ్ పట్టుబట్టి మరీ చంద్రబాబు నాయుడును ఒప్పించి నిధులను పంచాయతీలకు విడుదల చేయించి పల్లె పండగను నిర్వహించారు. మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మన ఊరు-మాటామంతీ పేరుతో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా పవన్ కల్యాణ్ ఈ కార్మక్రమానికి శ్రీకారం చుట్టారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నేడు శ్రీకాకుళం జిల్లా రావివలస ప్రజలతో పవన్ కల్యాణ్ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మన ఊరు-మాటామంతీ కార్యక్రమం జరగనుంది. టెక్కలిలోని థియేటర్ ఇందుకు వేదిక కానుంది. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను నివేదించవచ్చు. అక్కడికక్కడే సమస్యలన పరిష్కరించేలా పవన్ కల్యాణ్ ప్లాన్ చేశారు. పవన్ కల్యాణ్ ప్రజల్లోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టడం శుభపరిణామమని అంటున్నారు.

## అటెన్షన్ లో కేంద్రమంత్రులు

**న్యూఢిల్లీ, మే 23, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీకి వస్తున్నారంటే కేంద్ర మంత్రుల్లో గుండె దడ మొదలవుతుంది. ఆయన ఫైళ్లు పట్టుకుని మరీ వచ్చి రాష్ట్రానికి సంబంధించిన నిధులు, ప్రాజెక్టుల కోసం వస్తారు. అందుకే చంద్రబాబు ఢిల్లీ టూర్ అంటే కేంద్ర మంత్రులు ఆయన ఏ ప్రతిపాదనలు తీసుకు వస్తారోనన్న ఉత్కంఠ వారిలో నెలకొంటుందట. ఏ ముఖ్యమంత్రి కూడా ఢిల్లీకి ఇన్నిసార్లు వచ్చి తమ రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, నిధుల కోసం ప్రయత్నించడం లేదని, కానీ చంద్రబాబు మాత్రం నెలలో రెండు సార్లు ఢిల్లీకి వచ్చి తమను కలసి వినతులను సమర్పించి తమ పనులను సాధించుకు వెళుతున్నారని కేంద్ర మంత్రులే అనుకుంటున్నారట. చంద్రబాబు నాయుడు నేడు ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. మూడు రోజుల పాటు ఢిల్లీలోనే చంద్రబాబు ఉండనున్నారు. నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీకి బయలుదేరి వెళతారు. రేపు కేంద్ర మంత్రులను చంద్రబాబు కలవనున్నారు.కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో పాటు ఏడుగురు కేంద్ర మంత్రులతో శుక్రవారం భేటీ కానున్నారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులపై చర్చించనున్నారు. దీంతో చంద్రబాబు వస్తున్నారని, అపాయింట్ మెంట్ కావాలని అడిగిన వెంటనే వారు పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టు వివరాలను తెప్పించుకునే పనిలో ఉన్నారట.ముఖ్యంగా ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ల మద్దతు పైనే ఆధారపడి ఉంది. వీరిద్దరూ మోదీ కంటే ముందు నుంచి రాజకీయాల్లో ఉన్నవారు. రాజకీయ అనుభవం ఉన్న నేతలు మాత్రమే కాకుండా తమకు అవసరమైన వాటిని పట్టుబట్టి సాధించుకోవడంలో దిట్టలని పేరుపొందారు. ఇద్దరి నేతల అవసరాలు కూడా కేంద్రానికి ఉండటంతో అడిగిన వెంటనే అపాయింట్ మెంట్లు కూడా ఇచ్చేస్తున్నారు. అందులోనూ ఏపీ పరిస్థితి వేరు. అనేక హామీలు ఇచ్చి 2024 లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో, కేంద్ర ప్రభుత్వంలో రెండు పార్టీలు కలసి ఉన్నాయి..అయినా ప్రజా సమస్యల పరిష్కారం ఇలా చేయొచ్చుగా సామరస్యంగానే చెప్పి... ఈ నేపథ్యంలో చంద్రబాబు తీసుకు వచ్చే ప్రతిపాదనలతో పాటు నిధుల విషయంలో కూడా చూసీచూడనట్లు వ్యవహరించాల్సి ఉంటుంది. చంద్రబాబు కూడా ఒక పట్టాన వదిలి పెట్టే రకం కాదు. ఆయన గత పర్యటనలో తనకు ఇచ్చిన హామీలను ఇంకా పెండింగ్ లో ఉండటాన్ని కూడా ప్రస్తావించి కేంద్ర మంత్రులను ఇరకాటంలో పడేస్తారు. అంతే కాదు సామరస్యంగా, సానుకూలంగా మాట్లాడుతూనే రాష్ట్ర ప్రయోజనాలకు అవసరమైన ప్రాజెక్టులను, నిధులను తీసుకెళ్లడంలో చంద్రబాబు నేర్పరి అని హస్తినలో టాక్. అందుకే చంద్రబాబు హస్తిన ప్రయాణం అంటే టీడీపీ పార్లమెంటు సభ్యుల హడావిడి అటుంచితే.. కేంద్ర మంత్రులు మాత్రం హై అటెన్షన్ లో ఉండాల్సిందేనట.

## నోరు తెరుస్తున్న సీనియర్లు...

**కాకినాడ, మే 23, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో అక్కడక్కడ అసంతృప్తులు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మంత్రి పదవులు ఆశించి భంగపడ్డ సీనియర్ ఎమ్మెల్యేలు నోరు తెరుస్తున్నారు. తమ మనసులో ఉన్న మాటను బయట పెడుతున్నారు. ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు తెలుగుదేశం పార్టీ మహానాడు కడపలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మినీ మహానాడులు నిర్వహించాలని పార్టీ హైకమాండ్ ఆదేశించింది. ఈ తరుణంలో తూర్పుగోదావరి జిల్లా టిడిపి మినీ మహానాడులో ఆ పార్టీ నేతలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా జనసేనతో వస్తున్న సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా పార్టీ ముఖ్య నేత జ్యోతుల నెహ్రూ చేసిన కామెంట్స్ ఇప్పుడు సంచలనంగా మారాయి.జనసేనకు అగ్ర తాంబూలం.. తూర్పుగోదావరి జనసేనకు పట్టున్న జిల్లా. ఆపై పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. డిప్యూటీ సీఎం గా సైతం ఉన్నారు. అందుకే అక్కడ జనసేనకు ఎనలేని ప్రాధాన్యం దక్కుతోంది. నామినేటెడ్ పదవుల్లో సైతం పెద్దపీట వేస్తున్నారు. జనసేనతో పోల్చుకుంటే టిడిపికి అక్కడ అవకాశాలు తగ్గాయి. దీనిని అక్కడ టిడిపి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ముఖ్యంగా ద్వితీయ శ్రేణి నాయకత్వం తీవ్ర అసంతృప్తితో ఉంది. వారు నేరుగా ఎమ్మెల్యేల వద్ద తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు సైతం కలవరపాటుకు గురవుతున్నారు.ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన మహానాడు కాకినాడలో జరిగింది. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అయితే తన మనసులో ఉన్న ఆవేదనను బయటపెట్టారు. కాకినాడ జిల్లాలో పదవులు ఏ పార్టీకి వెళ్లాయో ఆలోచించాలని సూచించారు. మెజారిటీ ఉన్న తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఏంటో ఆలోచించాలని వ్యాఖ్యానించారు. ఇటీవల జనసేనకు చెందిన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబుకు రెండు పదవులు ఇచ్చారు. పేరు పెట్టకుండా దానిని ప్రస్తావిస్తూ ఒక వ్యక్తికి రెండు పదవులు అవసరమా అని ప్రశ్నించారు. పార్టీ నిర్ణయాల వల్ల టిడిపి నిర్వీర్యం అయిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ఎన్నాళ్ళు ఉంటుంది.. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకోలేదని చెప్పుకొచ్చారు. ఎన్నిసార్లు బయటకు రాలేదు అంటూ వ్యాఖ్యానించారు. టిడిపి తో పొత్తు వల్ల కమ్యూనిస్టు పార్టీలు నిర్వీర్యం అయిపోయాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. అదే పరిస్థితి టిడిపికి రాకుండా చూడాలని జ్యోతుల నెహ్రూ వ్యాఖ్యానించారు. అయితే గత కొద్దిరోజులుగా జ్యోతుల నెహ్రూ పార్టీ పై అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అందులో భాగంగానే ఈ కామెంట్స్ చేసి ఉంటారన్న అనుమానాలు ఉన్నాయి.ఇంకోవైపు కాకినాడ టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ చేసిన కామెంట్ సైతం సంచలనంగా మారాయి. కాకినాడ రూరల్ నియోజకవర్గానికి టిడిపి ఇన్చార్జ్ ప్రకటించక పోవడాన్ని తప్పుపట్టారు. ఆ నియోజకవర్గంలో జనసేనకు భారీ మెజారిటీ లభించడం వెనుక టిడిపి కార్యకర్తలు ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యకర్తలను కాపాడుకో లేకపోతే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని కూడా వ్యాఖ్యానించారు. అయితే జనసేన విషయంలో సలహాలు ఇస్తూనే టిడిపి నేతలు సంచలన వ్యాఖ్యలు చేస్తుండడం కూటమిలో విభేదాలకు కారణమవుతోంది.

# టెస్ట్ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన శ్రీలంక స్టార్ క్రికెటర్

**టెస్ట్ ఫార్మాట్ నుంచి తప్పుకుంటున్నట్లు ఏంజెలో మాథ్యూస్ ప్రకటన**

**బంగ్లాదేశ్‌తో జూన్ 17న జరిగే మ్యాచ్ చివరి టెస్ట్ అన్న మాథ్యూస్**

**పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కొనసాగుతానని స్పష్టీకరణ**



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక క్రికెట్ జట్టు సీనియర్ ఆటగాడు, మాజీ సారథి ఏంజెలో మాథ్యూస్ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ఈరోజు అధికారికంగా ప్రకటించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో తన ప్రస్థానానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించాడు. జూన్ 17వ తేదీన గాలే వేదికగా బంగ్లాదేశ్‌తో ప్రారంభమయ్యే తొలి టెస్ట్ మ్యాచ్ తన కెరీర్‌లో చివరిదని మాథ్యూస్ స్పష్టం చేశాడు.

ఈ నిర్ణయం గురించి మాథ్యూస్ మాట్లాడుతూ, "జూన్‌లో బంగ్లాదేశ్‌తో జరగనున్న మొదటి టెస్టు తర్వాత టెస్టు క్రికెట్ నుంచి తప్పుకోవాలని నిశ్చయించుకున్నాను. ఈ విషయాన్ని ఇప్పటికే సెలక్టర్ల దృష్టికి తీసుకెళ్లాను. అయితే, వన్డేలు, టీ20ల వంటి వైట్ బాల్ ఫార్మాట్లలో మాత్రం జట్టు అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉంటాను" అని తెలిపాడు.

ప్రస్తుతం శ్రీలంక టెస్టు జట్టులో ఎంతో మంది ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లు ఉన్నారని, వారిలో కొందరు భవిష్యత్తులో గొప్ప క్రీడాకారులుగా ఎదుగుతారని మాథ్యూస్ ఆశాభావం వ్యక్తం చేశాడు. "మరో యువ ప్రతిభావంతుడైన క్రికెటర్‌కు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాను" అని వివరించాడు.

గత 17 సంవత్సరాలుగా శ్రీలంక క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించడం తనకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నానని మాథ్యూస్ పేర్కొన్నాడు. "నా కెరీర్ మొత్తంలో నాకు మద్దతుగా నిలిచిన శ్రీలంక క్రికెట్ బోర్డుకు, నా సహచర ఆటగాళ్లకు, అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను" అని ఏంజెలో మాథ్యూస్ ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశాడు.

ఏంజెలో మాథ్యూస్ శ్రీలంక తరపున 118 టెస్టు మ్యాచ్‌లు ఆడి, 44 సగటుతో 8,167 పరుగులు సాధించాడు. అంతేకాకుండా, బౌలర్‌గా 33 వికెట్లు కూడా పడగొట్టాడు. 2009లో ఆస్ట్రేలియా జట్టుపై టెస్టుల్లో అరంగేట్రం చేసిన మాథ్యూస్, 34 టెస్ట్ మ్యాచ్‌లలో శ్రీలంక జట్టుకు నాయకత్వం వహించాడు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్-2024లో నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చివరిసారిగా శ్రీలంక తరపున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు.

# ఎట్టకేలకు రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్ పై స్పందించిన కోచ్ గంభీర్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్ట్ ఫార్మాట్ నుంచి వైదొలగడంపై టీమిండియా నూతన ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఎట్టకేలకు స్పందించాడు. వారిద్దరి నిర్ణయాలను పూర్తిగా వ్యక్తిగతమైనవిగా అభివర్ణించిన గంభీర్, వాటిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించాడు. జూన్ 20 నుంచి లీడ్స్‌లో ప్రారంభం కానున్న ఇంగ్లండ్ పర్యటన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశాడు. ఆధునిక క్రికెట్‌లో భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన ఇద్దరు దిగ్గజాల నిష్క్రమణతో జట్టులో ఏర్పడిన లోటుపై గంభీర్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. సీఎన్ఎన్-న్యూస్18కి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో గంభీర్ మాట్లాడుతూ, "ఆట ఎప్పుడు మొదలుపెట్టాలి, ఎప్పుడు ముగించాలనేది పూర్తిగా ఆటగాడి వ్యక్తిగత నిర్ణయం. ఈ విషయంలో కోచ్ అయినా, సెలక్టర్ అయినా, లేదా దేశంలో మరెవరైనా సరే, ఫలానా ఆటగాడు ఎప్పుడు రిటైర్ అవ్వాలో చెప్పే హక్కు ఎవరికీ లేదు. అది ఆటగాడి అంతర్గత భావన నుంచి రావాలి" అని స్పష్టం చేశాడు. ఈ నెల ఆరంభంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. దశాబ్దానికి పైగా భారత క్రికెట్‌లో కీలక పాత్ర పోషించిన వీరిద్దరి నిష్క్రమణ జట్టుపై ప్రభావం చూపుతుందని గంభీర్ అంగీకరించాడు. అయినప్పటికీ, ఈ పరిణామం యువ ఆటగాళ్లకు ఒక గొప్ప అవకాశమని నొక్కి చెప్పాడు. "కచ్చితంగా వారి అనుభవం లోటు తీర్చడం కష్టం. కానీ, ఆ బాధ్యతను స్వీకరించడానికి ఇతర ఆటగాళ్లు ఖచ్చితంగా ముందుకు వస్తారు. ఒకరు దూరమైతే, మరొకరికి దేశం కోసం ఏదైనా ప్రత్యేకంగా చేయడానికి అవకాశం లభిస్తుంది" అని గంభీర్ ఆశాభావం వ్యక్తం చేశాడు. జస్ప్రీత్ బుమ్రా వంటి కీలక బౌలర్ అందుబాటులో లేకపోయినా భారత జట్టు ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్న విషయాన్ని గంభీర్ ఈ సందర్భంగా గుర్తు చేశాడు. సీనియర్ ఆటగాళ్ల గైర్హాజరీలో కూడా జట్టు విజయాలు సాధించగలదని ఇది నిరూపిస్తుందన్నాడు.

కాగా, బీసీసీఐ రేపు శనివారం నాడు ఇంగ్లండ్ పర్యటనకు టెస్ట్ జట్టును, భారత నూతన టెస్ట్ కెప్టెన్‌ను ప్రకటించే అవకాశం ఉంది. ఈ సందర్భంగా గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మీడియా సమావేశంలో పాల్గొంటారని సమాచారం.

# పంజాబ్ కింగ్స్ జట్టు యాజమాన్యంలో విభేదాలు.. కోర్టుకెక్కిన ప్రీతి జింటా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) జట్టు పంజాబ్ కింగ్స్ సహ యజమాని, బాలీవుడ్ ప్రముఖ నటి ప్రీతి జింటా తన జట్టు యాజమాన్య సంస్థలోని ఇతర డైరెక్టర్లపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించారు. కేపీహెచ్ డ్రీమ్ క్రికెట్ ప్రైవేట్ లిమిటెడ్ (పంజాబ్ కింగ్స్ జట్టు యాజమాన్య సంస్థ) సహ డైరెక్టర్లు మోహిత్ బర్మన్, నెస్ వాడియాలకు వ్యతిరేకంగా ఆమె చండీగఢ్ కోర్టులో దావా వేశారు. ఏప్రిల్ 21న జరిగిన అసాధారణ సర్వసభ్య సమావేశం (ఈజీఎం) చట్టబద్ధతను, ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమె సవాలు చేశారు. ఏప్రిల్ 21న జరిగిన ఈజీఎంలో మునీష్ ఖన్నాను కొత్త డైరెక్టర్‌గా నియమించారు. అయితే, ఈ సమావేశ నిర్వహణలో కంపెనీల చట్టం, 2013లోని నిబంధనలను, ఇతర సెక్రటేరియల్ నియమాలను పాటించలేదని ప్రీతి జింటా తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ సమావేశం గురించి తనకు ఏప్రిల్ 10న ఈమెయిల్ ద్వారా సమాచారం అందినప్పటికీ, తాను లేవనెత్తిన అభ్యంతరాలను పట్టించుకోలేదని ఆమె పేర్కొన్నారు. వివాదాస్పద సమావేశానికి ప్రీతి జింటాతో పాటు మరో డైరెక్టర్ కరణ్ పాల్ కూడా హాజరయ్యారు. వీరిద్దరూ మునీష్ ఖన్నా నియామకాన్ని తీవ్రంగా వ్యతిరేకించినట్లు సమాచారం. అయినప్పటికీ మోహిత్ బర్మన్, నెస్ వాడియా మద్దతుతో సమావేశాన్ని కొనసాగించి, ఖన్నా నియామకాన్ని ఖరారు చేశారని ప్రీతి తన ఫిర్యాదులో తెలిపారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 21న జరిగిన సమావేశాన్ని, అందులో తీసుకున్న నిర్ణయాలను రద్దు చేయాలని ప్రీతి జింటా కోర్టును అభ్యర్థించారు. మునీష్ ఖన్నా డైరెక్టర్‌గా వ్యవహరించకుండా నిరోధించాలని కూడా ఆమె కోరారు. అంతేకాకుండా, ఈ కేసు పరిష్కారమయ్యే వరకు తాను, కరణ్ పాల్ హాజరు లేకుండా, మునీష్ ఖన్నా ప్రమేయం లేకుండా కంపెనీ ఎలాంటి బోర్డు లేదా సర్వసభ్య సమావేశాలు నిర్వహించకుండా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిణామం ఐపీఎల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



వైష్ణవి చైతన్య సంప్రదాయ చీరలో అందంగా కనిపిస్తోంది

# కాంతారా చాప్టర్ 1 రిలీజ్ డౌట్స్.. మళ్ళీ క్లారిటీ ఇచ్చిన మేకర్స్




"కాంతారా" సినిమాతో దేశవ్యాప్తంగా సంచలనం రేపిన రిషబ్ శెట్టి, ఇప్పుడు తన తదుపరి భారీ ప్రాజెక్ట్ "కాంతారా: చాప్టర్ 1"పై అన్ని వర్గాల ఆడియెన్స్ ను ఆకర్షిస్తున్నాడు. నటుడిగా, రచయితగా, దర్శకుడిగా అద్భుత ప్రతిభను కనబరిచిన రిషబ్, కేవలం కన్నడకే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్‌ను సంపాదించారు. మొదటి పార్ట్‌లోని అతని పెర్ఫార్మెన్స్, అజనీష్ లోకనాథ్ సంగీతం, జానపద అంశాల కథనం సినిమాకు కల్ట్ ఫాలోయింగ్ తెచ్చిపెట్టాయి. దీంతో ఇప్పుడు చాప్టర్ 1 అంటేనే అంచనాలు రెట్టింపు అయ్యాయి.

"కాంతారా: చాప్టర్ 1" ఇప్పటికే భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న విషయం తెలిసిందే. హొంబలే ఫిలింస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కర్ణాటకలోని అడవుల్లో ప్రామాణిక సెటప్‌తో భారీ స్థాయిలో షూటింగ్ జరుగుతోంది. ఇది ప్రీక్వెల్ కావడం వల్ల కథాభాగం మరింత మిస్టరీగా ఉండబోతుందన్న అంచనాలు ఉన్నాయి. అందులోను రిషబ్ మరోసారి నటనతో సరికొత్తగా ఆకట్టుకొనున్నట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల కొంతమంది యూట్యూబ్ చానల్స్, సోషల్ మీడియా పేజ్‌లు "కాంతారా: చాప్టర్ 1" రిలీజ్ వాయిదా పడిందని ప్రచారం చేయడం మొదలుపెట్టారు. దీంతో ఫ్యాన్స్‌లో గందరగోళం మొదలైంది. అయితే తాజాగా హొంబలే ఫిలింస్ క్లారిటీ ఇచ్చింది. వారి ప్రకటన ప్రకారం.. ఈ సినిమా షూటింగ్ పూర్తిగా ప్లాన్ ప్రకారమే ముందుకు సాగుతోంది. షూటింగ్‌లో ఎలాంటి ఆటంకాలు లేవు. అన్ని పనులు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారమే జరుగుతున్నాయని చెప్పేశారు. అలాగే "కాంతారా: చాప్టర్ 1" సినిమా ఇదే ఏడాది అక్టోబర్ 2 విడుదల కానుంది. ఈ తేదీ మారలేదని స్పష్టం చేశారు. అఫీషియల్ షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులూ లేవు. త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్‌ను అభిమానులతో పంచుకుంటామని తెలిపారు. దీంతో సినిమా వాయిదా పడిందని వస్తున్న రూమర్లన్నీ గాలి వార్తలేనని తేలిపోయింది.

ఇదిలా ఉంటే, "కాంతారా: చాప్టర్ 1" పట్ల ప్రేక్షకుల్లో నెలకొన్న ఆసక్తి విపరీతంగా ఉంది. మళ్ళీ రిషబ్ తన ప్రత్యేకమైన కథా దృక్పథంతో ఎంతగా మెప్పిస్తాడో అన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. పైగా ఈసారి తాను చూపించే మిస్టిక్ ప్రపంచం, డివైన్ కానెక్షన్ మరింత డార్క్, ఎమోషనల్‌గా ఉండబోతుందన్న టాక్ హైప్‌ను పెంచుతోంది. చూడాలి మరి.. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో.



కాలాతీత అందం: దివి వద్యా ఆకుపచ్చ చీరలో మెరిసింది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com